ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వరంగల్ రూరల్
20
మంగళవారం 1, ఆగస్టు 2017



చైర్మన్‌గా గెలిచిన వెంకట్‌నారాయణ గౌడ్‌ను అభినందిస్తున్న యువకులు, ఇన్‌సెట్లో వెంకటనారాయణ

ఊహించినట్లే..

- నర్సంపేట నగరపంచాయతీ చైర్మన్‌గా నాగెల్లి వెంకట నారాయణగౌడ్ ఎన్నిక
- కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్‌కు 5, నాగెల్లికి 15 ఓట్లు
- క్యాంప్ నుంచి నేరుగా పోలింగ్ కేంద్రానికి టీఆర్ఎస్ కౌన్సిలర్లు
- అధికారులకందని అనగ్జిన్-3, చెల్లని కాంగ్రెస్ విప్

2



పరకాల సంతకు పశువులను తరలించిన రైతులు

అప్పు పుట్టక.. అమ్మక తప్పుతలే..

వివరాలు: 2లో

అన్నదాతలకు ఎంత కష్టం వచ్చే.. కాళ్లరిగేలా తిరిగినా అప్పుపుట్టని దుస్థితి.. ఓ వైపు వ్యవసాయ పనులు చకచకా సాగుతుంటే.. మరోవైపు రుణాల కోసం పడరాని పాట్లుపడుతున్నారు. ఎక్కడా అరువు దొరక్క పోవడంతో కన్నీటిని దిగమింగుతూ మూగ జీవాలను అమ్ముకుంటున్నారు. గ్రామాల్లో జరిగే సంతలో పశువుల విక్రయాల తీరు ఆవేదన కలిగిస్తోంది. ఒక్క పరకాలలో ఆదివారం జరిగిన వారాంతపు సంతకు జిల్లాతోపాటు భూపాలపల్లి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు సుమారు 600 మూగజీవాలను క్రయవిక్రయాల కోసం తీసుకొచ్చారు. ఇది రైతుల దుస్థితికి అద్దం పడుతోంది. జిల్లా వ్యాప్తంగా మరెన్నో సంతల్లో పెద్దఎత్తున కాడెద్దులు, మేకలు, గొర్రెలు, కోళ్ల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. సంతలో ఏ రైతును కదిలించినా ఆవేదనాభరిత దృశ్యాలే దర్శనమిస్తున్నాయి. ఇదే అదునుగా భావించి దళారులు అమాయక రైతులను నిలువునా దోపిడీ చేస్తున్నారు.

-పరకాల

- సంతలో మూగజీవాల అమ్మకాలు..
- కన్నీరు పెడుతూనే రైతన్నల విక్రయాలు
- నిలువునా కర్షకులను మోసగిస్తున్న దళారులు
- సకాలంలో రుణమివ్వని బ్యాంకులు
- పరకాల సంతలో పెద్దఎత్తున పశువుల క్రయవిక్రయాలు

ఫిర్యాదులపై దృష్టి పెట్టండి

- జాయింట్ కలెక్టర్ ఎం. హరిత
- గ్రీవెన్స్‌సెల్‌కు 164ఫిర్యాదులు



20 ఫిర్యాదుదారుల క్యూలైన్

పోకిరీల ఆగడాలు

3

- ఆరుగురి విద్యార్థులపై చిత్రహింసలు
- ఆరు గంటల పాటు బంధించి వెట్టిచాకిరి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

చెట్లతోనే మానవ మనుగడ

ఎలుకుర్తిలో మొక్కను నాటి నీళ్లు పోస్తున్న స్వామిగౌడ్



- రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్
- ఎలుకుర్తిహవేలిలో మొక్కలు నాటిన స్వామిగౌడ్

8

ఆధార్‌లో తప్పులను సరిదిద్దుకోండి..



కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

2

పశువులే పంటకు పెట్టుబడి


పరకాల వారాంతపు సంతకు తీసుకొచ్చిన పశువులు

- మూగజీవాలను అమ్ముకుంటున్న రైతన్న దైన్యం
- బ్యాంకులు రుణాలు ఇవ్వక, అప్పులు లభించక ఇబ్బందులు

● పరకాల

వ్యవసాయ పెట్టుబడుల కోసం బ్యాంకుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా సకాలంలో వ్యవసాయ రుణాలు అందకపోవడం. ఊళ్లో అప్పులు పుట్టకపోవడం మరోవైపు సాగు పనులు ఆగిపోవడం ఇలాంటి అవస్థలతో రైతులు, కౌలు రైతులు చితికిపోతున్నారు. చివరకు తాము ఎంతో ప్రేమతో పెంచుకుంటున్న పశువులను విక్రయించడానికి సంసిద్ధులవుతున్నారు. పరకాల సంతకు వచ్చిన రైతులే ఇందుకు నిదర్శనం. ఇలాంటి వారు ఎందరో వ్యవసాయ పెట్టుబడుల కోసం గొర్రెలు, మేకలు, పాడిగేదెలు, ఎద్దులను అంగట్లో దళారులు అడిగిన అడ్డగోలు ధరలకు అమ్ముకుంటూ దోపిడీకి గురవుతున్నారు. రైతులను దోపిడీ చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేదు. బ్యాంకుల్లో రుణాలు వస్తాయని ఆశతో ఎదురుచూసినా నిరాశే మిగులుతోంది. మరోవైపు గ్రామాల్లో మధ్యతరగతి రైతులకు అప్పులు కూడా ఇవ్వడం లేదు. దిక్కుతోచని రైతులు పశువులను, జీవాలను అమ్ముకోక తప్పడం లేదు. దీనికి తోడు (జీఎస్టీ) ప్రభావంతో 5 శాతం ఎరువుల ధరలు పెరుగుతుండడంతో పశువులను అమ్మినా అవసరమైన డబ్బులు రాకపోవడంతో ఏమి తోచని స్థితిలో ఉన్నారు. జిల్లాలోని పరకాలలో నిర్వహిస్తున్న వారాంతపు సంతకు జిల్లాతో పాటు భూపాలపల్లి జిల్లా వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు సుమారు 600 మూగజీవాలను క్రయవిక్రయాల కోసం తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో పలువురు రైతులతో మాట్లాడితే వారి ఆవేదనాభరిత ఉదంతాలే వెలుగులోకి వచ్చాయి.

జిల్లాలో అధికారికంగా 2,40,818 పశువులు ఉండగా అనధికారికంగా 3 లక్షలకు పైగా ఉన్నాయి. ఇందులో నల్లజాతి పశువులు 1.20 లక్షలకు పైబడి, తెల్లజాతివి 74 వేల పైగా ఉన్నాయి. 75 వేల మేకలు, 4.40 లక్షల గొర్రెలు, 51 లక్షల కోళ్లు, 9.47 లక్షల పందులు ఉన్నాయి.

కోతగాళ్లకు అమ్మకం..

గత్యంతరం లేక ప్రాణంలా కాపాడుకున్న పశువులను రూపాయి ఎక్కువ వస్తుందంటే రైతులు కోతగాళ్లకు అమ్ముకుంటున్నారు. ఎన్నో సంవత్సరాలుగా రైతు అభివృద్ధికి తోడ్పడుతూ నిత్యం వారికి సాగులో చేదోడువాదోడుగా ఉన్న పశువులను అమ్ముకునే దశలో రైతులు కన్నీరు పెడుతున్నారు. చివరకు పశువుల కాళ్లు మొక్కి కోతగాళ్ల చేతిలో పెట్టి వెనుతిరగకుండా వెళ్లిపోతున్నారు.

కాడెద్దుల కన్నీళ్లు...

ఎన్నో ఏళ్లుగా రైతులకు సేవలు చేసిన కాడెడ్లు ఈరోజు కన్నీళ్లు పెట్టుకుంటున్నాయి. కోతగాళ్లు వారి ఇష్టానుసారంగా లారీ, వ్యాన్లలో ఎక్కించే సమయంలో తాళ్లతో లాగుతూ, కట్టెలతో కొట్టే దృశ్యాలు పలు రైతులను కంటతడి పెట్టిస్తున్నాయి. అటుచూస్తే పంటలు ఇటు చూస్తే పశువుల గోసతో రైతులు తల్లడిల్లిపోతున్నారు.

రైతుల బాధలు ఇలా..

భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన రాజయ్యకు నాలుగు ఎకరాల సాగుభూమి ఉంది. మూడెకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. మరో ఎకరం చెలకలో మిర్చి సాగు చేయాలనుకుంటున్నారు. పంటల పెట్టుబడికి, కూతురు చదువు కోసం చేతిలో చిల్లిగవ్వ కూడా లేదు. రుణం కోసం బ్యాంకుకు వెళ్లినా తిప్పుకుంటున్నారు. ప్రైవేటు వ్యక్తులు అప్పులు ఇవ్వడం లేదు. కురుస్తున్న వర్షాలకు పంటలకు ఎరువులు వేయాల్సిన సమయం వచ్చింది. పెట్టుబడి కోసం తప్పనిసరి పరిస్థితుల్లో పశువులను అంగట్లో బేరానికి పెట్టానని ఆవేదనతో చెప్పుకొచ్చారు.

మండలంలోని మాదారం గ్రామానికి చెందిన జంగిలి సాంబయ్య తనకున్న రెండున్నర ఎకరాల భూమిలో పత్తిపంటను సాగు చేస్తున్నారు. పత్తి చేనుకు అడుగు మందులు వేయాల్సిన సమయం వచ్చింది. కానీ ఎరువుల కొనుగోలుకు ఇంట్లో డబ్బులు లేవు. ఊళ్లో అప్పులు ఇవ్వడం లేదు. చేసేది లేక బాధను దిగమింగుకుంటూ వ్యవసాయ పనులకు వినియోగించే ఒక ఎద్దును సంతకు తీసుకొచ్చానని చెప్పుకొచ్చాడు.

కాగా, సంతలో ఎద్దును కొనుగోలు చేసే వారు అతి తక్కువ ధర చెప్పుతుండడంతో పెట్టుబడికి కావాల్సిన డబ్బు కూడా రావడం లేదని వాపోయాడు.

అన్ని పెట్టుబడులు ఒకేసారి వచ్చాయి

పేరబోయిన కుమారస్వామి మాధారం



అన్నిపెట్టుబడులు ఒకేసారి రావడంతో చాలా ఇబ్బంది ఏర్పడుతోంది. ప్రభుత్వం పంట రుణాలు బ్యాంకుల్లో వేసినా అధికారులు ఇవ్వడం లేదు. పిల్లల చదువులు, పంటకు పెట్టుబడులు అన్నీ ఒకే సారి వచ్చాయి. కొంతమంది రైతులు భార్య మెడలో ఉన్న పుస్తెలుతాడు అమ్ముకుంటున్నారు.

అమ్మేందుకు తీసుకొచ్చా

సారయ్య, మొగుళ్లపల్లి మండలం రంగాపురం



పత్తి మొలకలకు యూరియా బస్తాల కోసం ఎవరిని అడిగినా రూపాయి పుట్టడం లేదు. ఏమి చేయాలో తోచక అంగడికి ఒక్క ఎద్దును తీసుకువచ్చాను. రైతులు కొనేందుకు ఎవరు ముందుకు రాలేదు. కోతకు అడుగుతున్నారు. అటు పైసల్లేవు ఇటు అమ్ముకోలేను.

'ఆధార్' తప్పులు సరిదిద్దుకోండి.. ప్రభుత్వ పథకాలు పొందండి

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్


ఆధార్ అప్‌డేషన్ ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

గిర్మాజిపేట : కేంద్రం జారీ చేసిన గుర్తింపు కార్డు ఆధార్‌లోని వ్యక్తిగత వివరాల తప్పులను సరిదిద్దుకోవటం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ప్రజలను కోరారు. సోమవారం వరంగల్ ప్రధాన తపాలా కార్యాలయంలో ఆధార్ అప్‌డేషన్ (వివరాల సవరణ) సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. వరంగల్ తపాలా డివిజనల్ (రూరల్) సూపరింటెండెంట్ ఎం.నర్సింహరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంక్ అకౌంట్, పాసుపోర్ట్, విద్యార్థుల స్కాలర్‌షిప్, ఆసరా పింఛన్‌లు, గ్రామీణ ఉపాధిహామి వేతనాలు, రైల్ రిజర్వేషన్, పాన్‌కార్డుతో పాటుగా నిత్య జీవనంలో ప్రతిదానికి ఆధార్‌కార్డు తప్పనిసరిగా మారిందన్నారు. ఆధార్‌కార్డులో పేరు, ఇంటిపేరు, వయస్సు, చిరునామా, మొబైల్ నెంబర్ తదితర వివరాలు తప్పుగా పడితే తప్పనిసరిగా సరిచేసుకోవాలన్నారు. లేకపోతే ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లాలో 7 లక్షల 50 వేల మందికి ఆధార్‌కార్డులుంటే అందులో చాలా వరకు తప్పులున్నట్లు తెలుస్తోందన్నారు. వాటిని సవరించుకునేందుకు కేంద్రప్రభుత్వం ప్రధాన తపాలా కార్యాలయంలో ఆధార్ అప్‌డేషన్ సెంటర్‌లను ఏర్పాటు చేసిందన్నారు. ఆహార భద్రత కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేసి రేషన్ దుకాణాల్లో బయోమెట్రిక్ యంత్రాలను పెడుతున్నట్లు చెప్పారు. దీంతో రేషన్‌బియ్యం వివరాలు లబ్ధిదారుడికి చేరుతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 2 నెలల్లో బయోమెట్రిక్ యంత్రాలను ఏర్పాటు విద్యార్థుల ఆధార్‌కార్డులను వాటితో అనుసంధానం చేస్తామని తెలిపారు. నర్సంపేట, వర్ధన్నపేట, పర్వతగిరి, నెక్కొండ, సంగెం తపాలా కార్యాలయాల్లోను ఆధార్ సవరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం సవరణకు రూ. 25, కార్డు ప్రింట్ రూ. 10 మాత్రమే తీసుకోవాలని చెప్పారు. వరంగల్ తపాలా డివిజనల్ సూపరింటెండెంట్ ఎం.నర్సింహరాజు మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రధాన తపాలా కార్యాలయంలో ఆధార్ సవరణ కేంద్రం ఏర్పాటుచేశామన్నారు. కార్యక్రమంలో తపాలాశాఖ డివిజనల్ అధికారులు ఎ.వి.ఎన్.సత్యనారాయణ, ఎం.రమాదేవి, ఎల్.సైదానాయక్, కె.హరికృష్ణ, జి.కేశవరావు, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట నగరపంచాయతీపై టీఆర్ఎస్ జెండా

చైర్మన్‌గా వెంకట్‌నారాయణగౌడ్ ఎన్నిక


చైర్మన్‌గా గెలుపొందిన వెంకట్‌నారాయణ గౌడ్‌కు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల ప్రత్యేక అధికారి పూల్‌సింగ్‌చౌహాన్

నర్సంపేట : జిల్లాలోని నర్సంపేట నగర పంచాయతీ చైర్మన్ పదవిని టీఆర్ఎస్ కైవసం చేసుకుంది. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉదయం 11గంటలకు చైర్మన్ ఎన్నికను నిర్వహించారు. ఎన్నిక సమయానికంటే ముందే కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి రంజిత్‌రెడ్డి పార్టీ అందించిన బీ-ఫామ్‌ను ఎన్నికల అధికారికి అందజేశారు. నగర పంచాయతీకి 10:30గంటలకు 15మంది టీఆర్ఎస్ కౌన్సిలర్లు చేరుకోగా 10:40 గంటలకు ఐదుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు కార్యాలయ సమావేశ గదికి చేరుకున్నారు. ఉదయం 10గంటలకు టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నుంచి గత స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన కౌన్సిలర్ల పేర్లను ఎన్నికల ప్రత్యేకాధికారి పూల్‌సింగ్‌చౌహాన్ చదివి వినిపించారు. అనంతరం 11గంటలకు చేతులేత్తే పద్ధతిలో ఎన్నికను నిర్వహించారు. మొదట కాంగ్రెస్ నుంచి చైర్మన్ అభ్యర్థిగా పాలాయి శ్రీనివాస్ మద్దతు తెలిపే సభ్యులు చేతులెత్తాలని కోరగా ఐదుగురు కౌన్సిలర్లు శ్రీనివాస్‌కు మద్దతుగా చేతులెత్తారు. అనంతరం నాగెల్లి వెంకట్‌నారాయణను 3వ వార్డు కౌన్సిలర్ నాయిని నర్సయ్య చైర్మన్‌గా బలపర్చారు. వెంకట్‌నారాయణకు మద్దతు తెలిపేవారు చేతులెత్తాలని ఎన్నికల అధికారి కోరగా 15 మంది టీఆర్ఎస్ కౌన్సిలర్లు చేతులెత్తారు. కాంగ్రెస్ అభ్యర్థికన్నా 10ఓట్లు అధికంగా ఉండడంతో వెంకట్‌నారాయణగౌడ్ చైర్మన్‌గా గెలుపొందినట్లు ఎన్నికల అధికారి పూల్‌సింగ్‌చౌహాన్ ప్రకటించారు. రంజిత్‌రెడ్డి ఏ-ఫామ్, బీ-ఫామ్ ఎన్నికల అధికారికి అందజేసి అనెగ్జిన్-3పత్రాన్ని అప్పగించకపోవడంతో కాంగ్రెస్ విప్ చెల్లకుండా పోయిందని ఎన్నికల ప్రత్యేకాధికారి తెలిపారు. అనంతరం నాగెల్లి వెంకట్‌నారాయణగౌడ్‌కు ధ్రువీకరణ పత్రాన్ని ఆయన అందజేశారు. గతంలో కాంగ్రెస్ ఆధీనంలో ఉన్న నగర పంచాయతీ ఈసారి టీఆర్ఎస్ వశమైంది.

జిల్లాల పునర్విభజనలో పరకాలకు అన్యాయం

అఖిలపక్షం నాయకులు ● ఎంపీ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేత


వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న అఖిలపక్షం నాయకులు

పరకాల : కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనలో భాగంగా పరకాల ప్రాంతానికి పూర్తిగా అన్యాయం జరిగిందని కరీంనగర్ జిల్లా ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌కు పరకాల అఖిలపక్షం నాయకులు వినతి పత్రాన్ని అందించారు. సోమవారం కరీంనగర్ జిల్లాలోని ఎంపీ నివాసంలో అఖిలపక్ష నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పాటు కోసం ఉద్యమంలో ముందుండి పోరాడిన పోరాటాల గడ్డ పరకాలను చులకనగా చూస్తున్నారని, పాత డివిజన్‌తో కలుపుకొని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని లేదా వ్యాపారంతో సత్సంబంధం కల్గిన భూపాలపల్లి జిల్లాలో విలీనం చేయాలని కోరారు. జిల్లాకు అర్హత కల్గిన పరకాలలో కలెక్టరేట్ ఏర్పాటు చేయాలని ఉద్యమాలు, నిరసనలు చేసినప్పటికీ సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడమే కాకుండా వారికి అనువైన చోట కలెక్టరేట్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు కాకుండా పాలకుల ఇష్టానుసారంగానే పాలన కొనసాగుతోందని ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు స్పందించి పరకాల అభివృద్ధిపై సమీక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు కొల్గూరి రాజేశ్వర్‌రావు, డాక్టర్ సంతోష్‌కుమార్, పిట్ట వీరస్వామి, నక్క చిరంజీవి, బొచ్చు కృష్ణారావు, దుప్పటి సాంబయ్య, ఏకు సారయ్య, సూర్యదేవర సదానందం, యాట నరేష్, కానుగుల గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ నిబంధనలు అమలు చేయాలి : టీఎస్‌యూటీఎఫ్

వరంగల్ రూరల్ కల్చరల్ : ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల సర్వీస్ నిబంధనలు అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వరంగల్ రూరల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. సోమశేఖర్, పెండెం రాజులు డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన టీఎస్‌యూటీఎఫ్ సమావేశంలో వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా సర్వీస్ నిబంధనలు లేకపోవడంతో విద్యారంగం భ్రష్టు పట్టిందన్నారు. రాష్ట్రపతి ఆమోదం పొందిన రాష్ట్ర ప్రభుత్వం ప్రమోషన్లు, బదిలీలు నిర్వహించకుండా సవతితల్లి ప్రేమను ప్రదర్శిస్తోందన్నారు. జూనియర్ లెక్చరర్ల భర్తీ ప్రక్రియలో గతంలో ఉన్నట్లు 40 శాతం కోటాను ఉపాధ్యాయులకే కేటాయించాలన్నారు. కొత్త జిల్లా కేంద్రంలో వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. బదిలీలు, ప్రమోషన్లు షెడ్యూల్ ప్రకటించి డిప్యూటీ ఈవో, ఎంఈవో, బీఈడీ, డైట్, లెక్చ రర్ల పోస్టులు భర్తీ చేయాలన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు నారాయణ, ఫణి, కోశాధికారి రాజేందర్, రఘు పతిరెడ్డి, భాస్కర్, నవీన్‌కుమార్, సుజన ప్రసాద్, సత్యనారాయణ, వెంకటేశ్వర్, విజయ్ పాల్గొన్నారు.

విద్యార్థులను చిత్రహింసలు చేసిన పోకిరీలు



రాయపర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విద్యార్థులు

రాయపర్తి : తోటి స్నేహితులను కలుసుకోవడానికి వచ్చిన విద్యార్థులను అడ్డగించి బెదిరింపులకు గురిచేసి తన ఇంట్లో బందీగా చేసి ఆరు గంటలపాటు చిత్రహింసలు పెట్టి వారితో వెట్టిచాకిరి చేయించుకున్న సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని మొరిపిరాల లో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. కాట్రపెల్లికి చెందిన విద్యార్థులు గిరుక కేశవ్(12), కల్యాణ్(14), అభిషేక్(13), బెల్లి రాజు(14), సన్ని రాజు(13), చెన్నబోయిన లోకేష్ (14)ను అకారణంగా మొరిపిరాలకు చెందిన మేకల సురేశ్‌తో మరో ఇద్దరు కలిసి చిత్రహింసలకు గురిచేశారు. తోటి విద్యార్థుల వద్దకు వచ్చిన వీరు రోడ్డుపై వెళ్తుండగా అడ్డగించి పోలీసులు వస్తున్నారని, మిమ్మల్ని తీసుకెళ్తారని బెదిరించి ఇంట్లోకి తీసుకెళ్లారు. బయట తలుపులు పెట్టి ఇష్టం వచ్చినట్లుగా కొట్టారు. అనంతరం ఇంటి లోపల ఉన్న గడ్డిని చెక్కించడంతోపాటు తమ సొంత పనులు చేయించుకున్నారు. అయితే, గడ్డిని ఆలస్యంగా చెక్కారని మోకాళ్లపై కూర్చోబెట్టడంతోపాటు బట్టలు ఊడదీసి నిలబెట్టారు. కాళ్లపై పడి బతిమిలాడినా విద్యార్థులను భయాబ్రాంతులకు గురిచేశాడని చెపుతున్నారు. ఇలా ఆరు గంటల పాటు విద్యార్థులను బందీగా ఉంచారన్నారు. ఎవరికైనా ఈ విషయాన్ని చెపితే మిమ్మల్ని, మీ తల్లిదండ్రులను చంపేస్తామని బెదిరించడంతో విద్యార్థులు నోరు విప్పలేదు. సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లేందుకు స్నానం చేస్తుండగా విద్యార్థి తల్లి చూసి వీపుపై వాతలు ఎలా వచ్చాయని అడగడంతో విషయం బయట పడింది. దీంతో వారు పోలీసులను ఆశ్రయించారు. విద్యార్థులను కర్రతో కొట్టడంతో వాతలు వచ్చాయని, వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికత్స చేయించారు. అకారణంగా విద్యార్థులను చితకబాదిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

విచారణ చేస్తున్నాం- ఏఎస్‌ఐ

మండలంలోని కాట్రపెల్లి గ్రామానికి చెందిన విద్యార్థులను చిత్రహింసలకు గురిచేసిన విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని ఏఎస్‌ఐ వెంకటమల్లు తెలిపారు. గిరుక యాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు.

గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు

నర్సంపేట టౌన్ : నిషేధిత గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 5కిలోల ఎండుగంజాయిని స్వాధీనం చేసుకున్నామని నర్సంపేట ఎక్సైజ్ సీఐ శశికుమారి తెలిపారు. నర్సంపేట ఎక్సైజ్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరెస్టయిన వివరాలు సీఐ వెల్లడించారు. మండలంలోని మాధన్నపేట గ్రామంలో సోమవారం ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలపై అనుమానస్పదంగా వెళ్తున్న మాధన్నపేటకు చెందిన మారపాక రమేష్, గిరబోయిన సారంగపాణి, చక్రం తండాకు చెందిన అజ్మీర భద్రు(తండ్రి చందు), అజ్మీర భద్రు(తండ్రి దస్రు)లను నిలిపి సోదాలు చేశారు. వీరి వద్ద 5కిలోల ఎండు గంజాయి లభించింది. వెంటనే మారపాక రమేష్, గిరబోయిన సారంగపాణిని అరెస్టు చేయగా, మరో ఇద్దరు పరారయ్యారన్నారు. ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎండు గంజాయి విలువ రూ.25 వేలు ఉంటుందని తెలిపారు. సమావేశంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్, ఎస్సై శంకర్, కరంచంద్ సిబ్బంది పాల్గొన్నారు.



గంజాయిని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

చిన్నారులకు మీజిల్స్ రూబెల్లా వ్యాక్సిన్ వేయించాలి

దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఆర్. సునిత



కరపత్రంతో ఏసీ , డీఈఎంవో

వరంగల్ రూరల్ కల్చరల్ : వ్యాధులను అరికడుతూ చిన్నారులకు ఎలాంటి అంగవైకల్యం కలుగకుండా ఏ ఇతర వ్యాధులు రాకుండా ఎంతో ఉపయోగపడే మీజిల్స్ రుబెల్లా వ్యాక్సిన్ చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధతో వ్యాక్సిన్ వేయించాలని దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ రాయల సునిత అన్నారు. సోమవారం ఎండోమెంట్ శాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డీఈఎంవో డాక్టర్ స్వరూపారాణి ఏసీ సునితను కలిసి ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 23 వరకు జిల్లాలో చిన్నారులకు మీజిల్స్ రుబెల్లా వ్యాక్సిన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల పరిసర ఆధ్యాత్మిక కేంద్రాల్లోకి వచ్చే ప్రజలకు చిన్నారుల తల్లిదండ్రులను ఈ వ్యాక్సిన్ వేయించాలని అవగాహణ కల్పించే విధంగా దేవాదాయ శాఖ వారు సహకరించాలని కోరారు. ఏసీ సునిత స్పందించి ప్రభుత్వం చేపడుతున్న చిన్నారులకు వ్యాక్సిన్ వేయించే విధంగా కృషి చేస్తామని తెలిపారు.

'బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలి'

పర్వతగిరి: ఆగస్టు 2వ తేదీన మండలకేంద్రంలోని జేఆర్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించే బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు బాసాని సారంగపాణి అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కార్యవర్గ సమావేశానికి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, వన్నాల శ్రీరాములు, జిల్లా అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి తదితరులు హాజరవుతారని అన్నారు. జిల్లాలోని బీజేపీ కార్యకర్తలు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపుచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కుడికాల శ్రీధర్, నాయకులు బత్తిని దేవేందర్, నర్సయ్య, కుమారస్వామి, యాకాంబ్రం తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

సంగెం: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భార్య మంజూలకు భోజనం ఇచ్చి వస్తుండగా ట్రాక్టర్ ఢీ కొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన జరిగింది. సంగెం మండలం తీగరాజుపల్లి వద్ద సోమవారం జరిగింది. గ్రామస్థులు అందించిన సమాచారం మేరకు పర్వతగిరి మండలం ఏనుగల్లు గ్రామ శివారులో గల మాల్యా తండాకు చెందిన బానోతు భాస్కర్(28) భార్య మంజూలకు రంగశాయిపేటలోని ఓ ప్రైవేటు ఆస్ప త్రిలో ఆపరేషన్ జరిగింది. ఆమెకు భోజనం ఇచ్చేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగివస్తుండగా తీగరాజుపల్లి గ్రామ శివారులో ట్రాక్టర్ ఒక్కసారిగా వచ్చి భాస్కర్ వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో భాస్కర్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు.

మధర్ థెరిస్సా అవార్డు పొందిన ఉపాధ్యాయుడు



మధర్ థెరిస్సా అవార్డు పొందుతున్న సారంగపాణి దంపతులు

దుగ్గొండి: మండలంలోని తొగర్రాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చింతం సారంగపాణి మధర్ థెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ గురుబ్రహ్మ రాష్ట్ర అవార్డును ఆదివారం హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ అడిటోరియంలో అవార్డు అందుకున్నారు. అవార్డును ఆర్గనైజేషన్ చైర్మన్ కృష్ణమూర్తిచే సారంగపాణి దంపతులు పొందారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ఉపాధ్యాయబృందం అతడిని అభినందించారు.

'క్వారీని మూసివేయాలి'



జేసీతో మాట్లాడుతున్న రైతులు

వరంగల్ రూరల్ : జిల్లాలో నల్లబెల్లి మండలం రుద్రగూడెం, కన్నారావుపేట గ్రామాలకు చెందిన రైతులు సోమవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ఎం.హరితను కలిసి క్వారీ పనులను నిలిపి వేయడంతో పాటు స్థానిక పాఠశాల స్థలాన్ని పరిరక్షించాలని ఫిర్యాదు చేశారు. నల్లబెల్లి ఎంపీపీ బి.సారంగపాణి, వైస్ ఎంపీపీ చిట్యనాల మురళి, సర్పంచ్ వెంకన్న నేతృత్వంలో రైతులు జేసీని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుద్రగూడెం గ్రామ సమీపంలో క్వారీ పనుల మూలంగా దాన్నుంచి వచ్చే దుమ్ము ధూళితో ఇబ్బందులు పడుతున్నారని జేసీ దృష్టికి తీసుకెళ్లారు. అనుమతి లేకుండా నడిపిస్తున్న క్వారీని వెంటనే సీజ్ చేయాలని కోరారు. అలాగే స్థానిక పాఠశాల గ్రౌండ్‌ను గ్రామానికి చెందిన కొందరు వారి స్వంత భూమిగా చెప్పుకుంటూ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేశారు.స్పందించిన జేసీ నర్సంపేట ఆర్డీవోతో మాట్లాడి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటానని వారికి హామీ నిచ్చారు.

'భవిష్యత్‌ను నాశనం చేసే డ్రగ్స్‌ను తరిమికొట్టాలి'

ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు, విద్యార్థులు

వర్ధన్నపేట: భవిష్యత్తును నాశనం చేసే డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని వరంగల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి అన్నారు. మనోవికాసాన్ని దెబ్బతీసే డ్రగ్స్, మత్తుపానీయాలను నివారించడంలో భాగం గా వర్ధన్నపేట ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం వర్ధన్నపేట మండల కేంద్రంలో భారతీ డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ క్షణికావేశంలో తాత్కాలిక సంతోషం కోసం యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ వరంగల్ రూరల్ డీటీఎఫ్ సీఐ కరంచంద్, సీఐ కరుణశ్రీ, ఎస్‌ఐలు భాస్కర్‌రెడ్డి, జయశ్రీ, టాస్క్‌ఫోర్స్, వర్ధన్నపేట స్టేషన్ సిబ్బంది రాజమౌళి, కె.శేఖర్, యాదగిరి, రాజ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏడో రోజుకు చేరిన సమ్మె

నర్సంపేట టౌన్ : తమ సమస్యల పరిష్కారం కోసం నర్సంపేట సివిల్ సప్లయిస్ గోదాం హమాలీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారం 7వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా హమాలీ కార్మికులు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. అనంతరం సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పంజాల రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే హమాలీ కార్మికులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గుంపెల్లి మునీశ్వర్, నాగేశ్వర్‌రావు, మహేందర్, మల్లయ్య, రవి, కుమార్ పాల్గొన్నారు.

'కుటుంబాల ఆర్థికాభివృద్ధికి పొదుపు అవసరం'



ప్రశాంతి మండల సమాఖ్య మహాసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణరావు

దుగ్గొండి : కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రతీ ఒక్కరు పొదుపు చేయడం అలవర్చుకోవాలని తహసీల్దార్ సత్యనారాయణరావు అన్నారు. మండలకేంద్రంలోని ప్రశాంతి మండల సమాఖ్య 9వ వార్షిక మహాసభ సోమవారం ఉపాధ్యక్షురాలు ఉమారాణి అధ్యక్షతన నిర్వహించారు. మహాసభకు హాజరైన తహసీల్దార్ పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లో పొదుపు సంఘాలు ఏర్పడి కుటుంబ ఆర్థిక అవసరాలకు పొదుపును ఉపయోగించుకుంటున్నారన్నారు. మండల సమాఖ్య నుంచి పొందుతున్న రుణాలను వినియోగించుకోవాలన్నారు. మండలంలో 41 గ్రామాఖ్య సంఘాల్లో 1097 పొదుపు సంఘాలు ఉండడం అభినందనీయమన్నారు. ఈ మహాసభలో ఎంపీపీ కుక్కమూడి సుశీల, ఏపీఎం రాజ్‌కుమార్, సీసీలు, సీఏలు, వీవో సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

'అన్మాన్డ్ కార్మికులకు కనీస వేతనాలు అందించాలి'


డీఈ విజయ్‌కి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

నర్సంపేట : విద్యుత్ సంస్థలో పని చేస్తున్న అన్మాన్డ్ కార్మికులకు కనీస వేతనం అందించాలని కోరుతూ పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో డీఈ విజయ్, ఏఈ టెక్నికల్ సంపత్‌కు సోమవారం టీఆర్ఎస్‌కేవీ జిల్లా ఇన్‌చార్జి గోనె యువరాజ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల నుంచి విద్యుత్ సంస్థలో అన్మాన్డ్ కార్మికులుగా పని చేస్తున్న వారికి కనీస వేతనం అందడం లేదన్నారు. అన్మాన్డ్ కార్మికులు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని అధికారులను కోరినా ఫలితం దక్కలేదన్నారు. ప్రతీ కార్మికుడికి రూ.16,500వంతున కనీస వేతనం అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పాలడుగుల రమేష్, లక్ష్మీనారాయణ, అన్మాన్డ్ యూనియన్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు కుమ్మరికుంట్ల కృష్ణ, ఇల్లెరావు సాగర్, రాజు, గౌతమ్‌కుమార్, కృష్ణ, మణికుమార్, అశోక్, భద్రయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

ఘనంగా టీజీవీపీ 5వ ఆవిర్భావ దినోత్సవం

నర్సంపేట టౌన్ : తెలంగాణ విద్యార్థి పరిషత్(టీజీవీపీ) 5వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం టీజీవీపీ డివిజన్ కన్వీనర్ ఎ.రాజు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం టీజీవీపీ నిరంతరం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సాగర్, సిసింద్రి, రాజేందర్, మల్లి పాల్గొన్నారు.

'నర్సంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి'

నర్సంపేట టౌన్ : అన్ని రకాలుగా ప్రజలకు సౌకర్యంగా ఉన్న నర్సంపేటను జిల్లా కేంద్రంగా ప్రభుత్వం ప్రకటించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు టాకా రాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొంతమంది స్వార్థ రాజకీయ లబ్ధి కోసమే నర్సంపేటను జిల్లా కేంద్రాన్ని ఏర్పాటు చేయకుండా అడ్డుపడుతున్నారన్నారు. ఈ సమావేశంలో రవీందర్‌సింగ్, సాంబయ్యచారి, రంజిత్‌కుమార్, రామానుజచారి, గగన్ పాల్గొన్నారు.

నల్లబెల్లిలో...

నల్లబెల్లి : జిల్లాకేంద్రాన్ని నర్సంపేటలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ టీడీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మండలకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఒక రోజు దీక్షను నిర్వహించారు. ఈ దీక్షలనుద్దేశించి మండల అధ్యక్షుడు మామిండ్ల మోహన్‌రెడ్డి మాట్లాడారు. ఈదీక్షలో మాలోతు ప్రతాప్‌సింగ్, అడుప నర్సింగరావు, ఓల్లె పర్వతాలు, ఎంపీటీసీ పాడ్య బద్రునాయక్, ఆసం చంద్రమౌళి, ఊట్కూరి ఆశోక్, గడ్డె జైపాల్‌రెడ్డి, బ్రహ్మాచారి తదితరులు బైటాయించారు. దుగ్గొండి మండల అధ్యక్షుడు చుక్క రమేష్, మాజీ ఎంపీపీ బూర్గు రవీందర్, బీజేపీ జిల్లా నాయకుడు అశోక్‌గౌడ్, జేఏసీ నాయకులు పవన్, రాజేశ్వర్‌రావు, ఎంపీటిసీ రాములు పాల్గొని దీక్షలకు సంఘీభావం ప్రకటించారు.



నల్లబెల్లిలో జిల్లా కేంద్రం కోసం చేపట్టిన దీక్ష

'సామాజిక కార్యక్రమాల్లో మహిళలు ముందుండాలి'

నల్లబెల్లి : గ్రామాల్లో అభివృద్ధికి దోహదపడే సామాజిక కార్యక్రమాల్లో మహిళలు ముందుండాలని జడ్పీ వైస్‌చైర్మన్ మురళీధర్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని మధర్ థెరిస్సా పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం, మార్కెటింగ్ మండల సమాఖ్య 7వ, వార్షిక మహాసభ అధ్యక్షురాలు గొనె శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. ఈసభలో మురళీధర్ పాల్గొని మాట్లాడారు. సభ్యులు సంఘం తమదిగా భావించినప్పుడు అభివృద్ధిలో పయనిస్తుందన్నారు. అనంతరం సంఘాన్ని అభివృద్ధిలోకి తీసుకవచ్చిన సంఘం అధ్యక్షురాలు శ్రీదేవి, ఏపీఎం సునితలకు శాలువాలు కప్పి సన్మానించారు. ఈసభలో ఎంపీపీ సారంగపాణి, ఎంపీడీవో మూర్తిరెడ్డి, సర్పంచ్ కొటిలింగాచారి, ఎంపీటిసీ రాజారాంయాదవ్, ఏసీ, ఏపీఎం, ఏపీవో పాల్గొన్నారు.

ఆటో కార్మికుల బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ


సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్సంపేట : వరంగల్ మునిసిపల్ గ్రౌండ్‌లో నేడు(మంగళవారం) జరిగే ఆటో కార్మికుల బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను టీఆర్ఎస్‌కేవీ జిల్లా ఇన్‌చార్జి గోనె యువరాజ్ ఆధ్వర్యంలో ఆటో యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. ప్రపంచ ఆటో కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు వరంగల్‌లో జరిగే సభకు ఆటో డ్రైవర్లు కార్మికులు, అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంద్రారెడ్డి, పాలడుగుల రమేష్, కందికొండ శ్రీను, రఘు, సాగర్, రవి, సుభాష్ పాల్గొన్నారు.

ఆడపిల్లల ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి : ఎస్సై

దుగ్గొండి : ఆడపిల్లల ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలని, మనోధైర్యం కలిగి ఉండాలని ఎస్సై భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని గిర్నిబావిలోని మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో స్వశక్తిపై బాలికలకు శిక్షణాశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ బాలికల్లో మనోధైర్యం కలిగి ఉండేలా ప్రత్యేకంగా టీమ్‌ను ఏర్పాటు చేసి మెళకువలను నేర్పడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిల్, ఇసాక్, తిరుపతి, యాకూబ్, టీమ్ సభ్యులు రమా, ఉమా, జ్యోతి పాల్గొన్నారు.


మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ఎస్సై భాస్కర్‌రెడ్డి

ప్రారంభమైన భూ సర్వేలు


లింగాపురంలో ఇంటింటి సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

నెక్కొండ : సమగ్ర భూసర్వేలో భాగంగా మండలంలోని పత్తిపాకలో భూ సర్వేను అధికారులు సోమవారం ప్రారంభించారు. గ్రామంలో 250 రైతు కుటుంబాలు ఉండగా మొదటి రోజున 91 మంది రైతులకు సంబంధించిన భూముల కాగితాలను అధికారులు పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం అందించనున్న ఏకరాకు నాల్గువేల పథకంకు అర్హులలైన రైతులను గుర్తించుటకు ఈ సర్వేను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్ధార్ విశ్వనారాయణ, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది యాకయ్య, రాజు, రవీందర్‌రావు, బాబు, అనిల్, సారంగం పాల్గొన్నారు.

ఖానాపురంలో...

ఖానాపురం : మండలంలోని రంగాపురంలో తహసీల్ధార్ రజిని ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించారు. రైతులకు సంబంధించిన భూముల సమస్యలపై సర్వే నిర్వహించారు. పహణీలు, 1బీలు సరిగా లేని రైతులు వెంటనే దరఖాస్తులు చేసుకొని సరి చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ నవీన్, వీఆర్వోలు అశోక్, శ్రవణ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేటలో...

చెన్నారావుపేట : మండలంలోని లింగాపురంలో ఇంటింటా భూసర్వేను రెవెన్యూ అధికారులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుభాషిణీ, గిర్ధావర్ రషీద్, వీఆర్‌వోలు హరికృష్ణ, శ్రీధర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయ సలహా సభ్యుడిగా యాకసాయన్న

ఖానాపురం : హిమాలయ సోషల్ సర్వీస్ సొసైటీ నిర్వహిస్తున్న నేషనల్ అగ్రికల్చర్ రూరల్ డెవలప్‌మెంట్ బోర్డు ప్రాజెక్టుకు జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడిగా ధర్మరావుపేటకు చెందిన లింగబత్తుల యాక సాయన్నను నియమించినట్లు ఆ సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ కుంట రమేష్ ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలపై సలహాలు సూచనలు ఇచ్చేవిదంగా ప్రాజెక్ట్‌ను తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు.

'విద్యార్థుల పుస్తకాల బ్యాగ్ బరువును తగ్గించాలి'

నర్సంపేట : ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల పుస్తకాల బ్యాగ్ బరువును తగ్గించేలా చూడాలని ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఎంఈవో కొర్ర సారయ్య ఆదేశించారు. పట్టణంలో సోమవారం ప్రైవేట్ పాఠశాలల హెచ్ఎంలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థుల పుస్తకాల బ్యాగ్ బరువును 6 నుంచి 12కిలోల లోపే ఉండేలా చూడాలని లేని పక్షంలో చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో వడుప్సా ప్రతినిధి రమేష్, ఎస్‌కె.జావెద్, ప్రైవేట్ పాఠశాలల హెచ్ఎంలు, సీఆర్‌పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి 5
మంగళవారం 1 ఆగస్టు 2017
●వరంగల్ రూరల్
వర్ధన్నపేట నర్సంపేట ZONE

నేడు అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష

రాయపర్తి : మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై నేడు(మంగళవారం) కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మోజెస్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు అధ్యక్షతన సమీక్ష జరుగుతుందన్నారు. మండలంలో మంజూరైన శ్మశానవాటికల నిర్మాణాలు, డంపింగ్ యార్డుల అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల్లో పనుల పురోగతిపై మండల ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష చేయనున్నట్లు వివరించారు.

రేకెత్తుతున్న అనుమానాలు

బాలుడి మరణంపై వీడని మిస్టరీ

మృతదేహాన్ని బంధువులకు అప్పగించిన పోలీసులు

గుట్టపైన మరో ఖననం ఆనవాళ్లు





ఇర్షాద్ (ఫైల్)

భీమునిపాదం గుట్టపై పూడ్చిన మృతదేహాన్ని బయటకు తీస్తున్న అధికారులు

ఖానాపురం : బుధరావుపేటలో ఈ నెల 26న అదృశ్యమై మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని భీమునిపాదం జలపాతం గుట్టపై శవమైన బాలుడు షేక్ ఇర్షాద్ మృతదేహాన్ని సోమవారం పోలీసులు వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించకుండానే బాలుడిని పూడ్చి వేయడంతో ఆదివారం బుధరావుపేట జాతీయ రహదారిపై ముస్లింలు పెద్ద ఎత్తున రాస్తారోకో చేపట్టి పోలీసులను నిలదీసిన విషయం విదితమే. దీంతో గూడూరు పోలీసులు, ఖానాపురం ఎస్సై గురుస్వామి ఆధ్వర్యంలో భీమునిపాదం వద్ద బాలుడి శవాన్ని పాతిపెట్టిన సమాధి నుండి శవాన్ని వెలికి తీసి బంధువులకు అప్పగించారు. దీంతో బంధువులు శవాన్ని బుధరావుపేటకు తీసుకువచ్చి కుటుంబ సభ్యుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. తమ కుమారుడికి మాయమాటలు చెప్పి భీమునిపాదం తీసుకుపోయి హత్యచేసిన హంతకులను పోలీసులు వెంటనే గుర్తించి శిక్షించాలని మృతుని బంధువులు డిమాండ్ చేశారు.

ఇర్షాద్ మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాలుడి వద్ద ఉన్న సెల్ నుంచి లాస్ట్ కాల్ ఎవరికి వెళ్లింది.? అన్న విభిన్న కోణాల్లో పోలీసులు విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

మద్యం సేవిస్తే చర్యలు తప్పవు : సీఐ రమేష్

భీమునిపాదం జలపాతం ప్రాంతంలో మద్యం సేవించడం నిషేధించాం. ఎవ్వరైనా మద్యం సేవిస్తే కేసులు పెడుతాం. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో సీతానాగారంలో మద్యం నిషేధిత కమిటీని వేయడంతో పాటు సూచిక బోర్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం.

గుట్టపై ఉన్న మరో ఖననం ఆనవాళ్లు ఎవ్వరివి...?

భీమునిపాదం గుట్టపై మృతదేహం లభ్యమైన ప్రదేశానికి సమీపంలోనే ఖననం చేసిన ఆనవాళ్లతో ప్రదేశం కనిపిస్తుండటంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ ప్రదేశంలో సహజంగా ఎవ్వరినీ ఖననం చేయరని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులకు తెలిపిన అనంతరం చేపట్టాల్సిన చర్యలపై పోలీసులు ముందడుగు వేయనున్నట్లు సమాచారం.

'డ్రగ్స్ వాడకాన్ని నిషేధించాలి'

ఖానాపురం : డ్రగ్స్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని సెయింట్ మేరిస్ విద్యాసంస్థల చైర్మన్ కంభంపాటి ప్రతాప్ అన్నారు. సోమవారం ఐనపల్లి రుద్రమాదేవి మహిళా డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్ వ్యసనానికి అలవాటు పడితే ఆరోగ్యపరంగా, సమాజపరంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిషన్‌రెడ్డి, శ్రీధర్, నగేష్, రాజేందర్ పాల్గొన్నారు.

చెన్నారావుపేటలో...

చెన్నారావుపేట : మండల కేంద్రంలో సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు డ్రగ్స్‌ను నిషేధించాలని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జక్క అశోక్, ఎస్సై జగదీష్, జడ్పీటీసీ రాంరెడ్డి, కంది గోపాల్‌రెడ్డి, ఎస్‌బీఐ మేనేజర్ ఈశ్వర్‌రావు, హెచ్ఎం కర్ణాకర్‌రెడ్డి, శివరాజ్, రమేష్, కృష్ణమోహన్, హరిప్రసాద్, సుమన్ పాల్గొన్నారు.



చెన్నారావుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న సిద్ధార్థ విద్యార్థులు

'వందశాతం హాజరయ్యేలా చూడాలి'

పర్వతగిరి : మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో వందశాతం విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని ఎంఈవో అజాముద్దీన్ అన్నారు. సోమవారం మండలంలోని చింతనెక్కొండ, ఏనుగల్లు గ్రామాల్లోని పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో ఈజీఎస్ ద్వారా నిర్మిస్తున్న కిచెన్‌షెడ్లు, టాయిలెట్ల నిర్మాణ ప్రగతిపై ఎంపీపీ రంగు రజితకుమార్ నిర్వహించిన సమీక్షలో పాల్గొని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణయ్య, ఏపీవో సుశీల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రారంభమైన సమగ్ర భూసర్వే



కొత్తపల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ కనకయ్య

పర్వతగిరి : మండలంలోని బూర్గుమళ్లలో సోమవారం సమగ్ర భూసర్వేను ప్రారంభించారు. సర్వేలో భాగంగా గ్రామంలో గ్రామసభను నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో భూసమస్యలను పరిష్కరించడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ మధుసూదన్, సర్పంచ్ రామ్మూర్తి, వీఆర్వో పాల్గొన్నారు.

వర్ధన్నపేటలో...

వర్ధన్నపేట : మండలంలోని కొత్తపల్లిలో జీపీకార్యాలయంలో సర్పంచ్ యాకమ్మ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ కనకయ్య, ఎంఆర్ఐ, వీఆర్‌వోలు గ్రామస్థులు పాల్గొన్నారు.

'థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై కేసులు నమోదు చేయాలి'

వర్ధన్నపేట : దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వారిని వెంటనే సస్పెండ్ చేయాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం (టిఎఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను నర్సయ్య, జిల్లా ఇన్‌చార్జి కొండేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మండలకేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ దళితులను క్రూరంగా హింసించిన పోలీసులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వానికి దళితులపై ఉన్న ప్రేమను స్పష్టం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు ఎల్లయ్య, యాకాంతం, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పాఠశాలలో యూనిఫాం పంపిణీ

ఖానాపురం: బుధరావుపేట ప్రభుత్వ మోడల్ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు స్కూల్ యూనిఫాం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుభాన్ బీ, ఎస్ఎంసీ చైర్మన్ కుమార్, ప్రిన్సిపాల్ రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టాభూములో గుడిసెలు వేశారని ఫిర్యాదు

నల్లబెల్లి : మండలంలోని రేలకుంటలో సీపీఎం ఆధ్వర్యంలో కొందరు వ్యక్తులు తమ పట్టా భూముల్లో గుడిసెలు వేశారని బాధిత రైతులు కూచన బాబు, కె. మల్లయ్య, ఎ.వీరన్న, ఎస్. సంపత్‌రావు తెలిపారు. సోమవారం మండలకేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ సర్వే నెంబర్లు 2లోని భూమిపై తాము పట్టా పొంది ఉన్నామన్నారు. మా భూమిలో గుడిసెలు వేయడం శోచనీయమన్నారు. ఈ మేరకు తహసీల్ కార్యాలయంలో, పోలీస్‌స్టేషన్‌లో గుడిసెలు వేసి, భూమిని ఆక్రమించిన వారిపై ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో హరితహారం



పెద్దకొర్పోలులోని కస్తూర్బా పాఠశాలలో మొక్కను నాటుతున్న ఏసీపీ మురళీధర్

నెక్కొండ : మండలంలోని పెద్దకొర్పోలులోని కస్తూర్బా గురుకుల పాఠశాలలో సోమవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన హరితహారంలో ఏసీపీ దాసరి మురళీధర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్‌రావు, ఎస్సై మిథున్, పాఠశాల ప్రత్యేకాధికారిణి మేనక, మండల కోఆప్షన్‌సభ్యులు షైబూబ్‌పాషా, ఇంద్రసేనారెడ్డి, యాదగిరి, పోలీసులు బిల్లర్ శ్రీనివాస్, యాకయ్య, సీతారామరాజు, శేఖర్, రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నారావుపేటలో...

చెన్నారావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో హరితహారంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మామిడి మొక్కలను పంపిణీ చేశారు. బాపునగర్‌లో ఎస్సై జగదీష్ గ్రామస్థులకు 2వేల మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం భద్రయ్య, ఏఎస్సై కుమారస్వామి, నరేష్, పాల్గొన్నారు.

దుగ్గొండిలో...

దుగ్గొండి : మండలంలోని పొనకల్‌లో పోలీసుల ఆధ్వర్యంలో హరితహారంలో భాగంగా 500 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్సై భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ శారద, శ్రీనివాస్, దేవేందర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

వర్ధన్నపేటలో...

వర్ధన్నపేట : మండల కేంద్రంలోని శివాణి ఇ టెక్నోస్కూల్‌లో హరితహారంలో భాగంగా ఏసీపీ దుర్గయ్యయాదవ్ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో సీఐ ఆదినారాయణ, ఎస్ఐలు ఉపేందర్, సందీప్‌కుమార్, హరితహారం ఇన్‌చార్జి భూషన్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖానాపురంలో...

ఖానాపురం : మండలంలోని మనుబోతుల గడ్డ శివారు బండమీదిమామిడి తండాలో సోమవారం ఎస్సై గురుస్వామి ఆధ్వర్యంలో హరితహారంలో 500మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ భాష, యాసకు పీఆర్‌టీయూ ఫిదా

వరంగల్ రూరల్ కల్చరల్ : తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తూ ప్రత్యేక శైలిలో తెలంగాణ యాసను వెండితెరపై ఆవిష్కరింపచేసి పూర్తిగా తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కించిన చిత్రం ఫిదాను రూరల్ జిల్లా పీఆర్‌టీయూ కార్యవర్గం సోమవారం వరంగల్‌లో తిలకించారు. స్టేషన్‌రోడ్‌లోని ఎస్2 సినిమా థియేటర్స్‌లో బుక్ చేసినట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పింగిళి శ్రీపాల్‌రెడ్డి, ఎడ్ల ఉపేందర్‌రెడ్డి తెలిపారు. చలనచిత్ర చరిత్రలో తొలిసారిగా తెలంగాణ గ్రామీణ ముఖ చిత్రాన్ని చూపినందుకు దర్శక నిర్మాతలు శేఖర్ కమ్ముల దిల్‌రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు జిల్లా, రాష్ట్ర బాధ్యులు మహిళా ప్రతినిధులు తిలకించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు తిరుపతిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రాంచంద్రం, కాంతారావు, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.



ఎస్-2 థియేటర్స్ ముందు పీఆర్‌టీయూ కార్యవర్గం

ఘనంగా టీజీవీపీ వార్షిక వేడుకలు

పరకాల : తెలంగాణ విద్యార్థి పరిషత్ 5వ వార్షికోత్సవ వేడుకలను పట్టణంలోని పాత ఏటీఎం సెంటర్ వద్ద సోమవారం ఘనంగా జరుపుకున్నారు. టీజీవీపీ జెండాను తెలంగాణ విద్యార్థి పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఇంగిలి వీరేష్‌రావు ఆవిష్కరించి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు దేవునూరి మేఘనాథ్, గండ్ర జయపాల్‌రెడ్డి, గోపీనాథ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు బండి సారంగపాణి, టీజీవీపీ రాష్ట్ర నాయకులు మునిసిపల్లి శివప్రసాద్, మారోజు రంజిత్, నాయకులు కేశెట్టి రాజేష్, దేవునూరి మనోజ్‌కుమార్, దాసరి సాయికుమార్, అఖిల్, మహేష్, జయశంకర్, సాయిసాగర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా సంజీవరావు

శాయంపేట : బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా శాయంపేట మండలకేంద్రానికి చెందిన కోడెపాక సంజీవరావును నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ ఎదుగుదల కోసం అహర్నిశలు పనిచేస్తున్న క్రమంలో గుర్తించి జిల్లాస్థాయి బాధ్యతలను అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, తన నియమానికి సహకరించిన ఎడ్ల అశోక్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

'ఎస్సీ రుణాల దరఖాస్తుకు గడువు పెంపు'

వరంగల్ రూరల్: జిల్లా ఎస్సీ కార్పొరేషన్ వార్షిక రుణ ప్రణాళిక 2017-18 ఆర్థిక సంవత్సరానికి రూ. 37.48 కోట్లతో ప్రణాళిక ను ప్రభుత్వం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. అయితే ఇందుకు గాను జూలై 31 లోపు నిరుద్యోగులు రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని గతంలో ప్రభుత్వం ఉత్తర్వు లు వెలువరించింది. అయితే తక్కువ సమ యం ఉండడంతో నిరుద్యోగులకు ఈ సమాచారం పూర్తిగా చేరలేదని దీంతో ప్రభుత్వం తేదీని పొడిగిస్తూ ఆగస్టు 15 లోపు దరఖా స్తు చేసుకునేందుకు అవకాశం కల్పించిందని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేష్ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. జిల్లాలో వివిధ పథకాల కింద 1301 యూనిట్లకు నిరుద్యోగులు ఆయా మండల,. గ్రామా ల పరిధిలోని అర్హత కల్గిన వారందరూ దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియో గం చేసుకోవాలన్నారు.

రుణాల్లో వీరికి ప్రాధాన్యం..

విద్యావంతులైన నిరుద్యోగ యువతీ యువకులు గ్రామీణ పట్టణ మహిళలు భూ మి లేని వ్యవసాయ కూలీలు, సన్నకారు రైతులు, పచ్చితోళ్ల శుద్ధి చేసే వారు, లొంగిపోయిన నక్సలైట్లు, వెట్టి చాకిరి చేసేవారు. పారిశుధ్య కార్మికులు గుడుంబా వృత్తిలోని వారికి పునరావాసం ప్రాధాన్యం ఇస్తామని ఈడీ సురేష్ తెలిపారు.

'పెరుకల అభివృద్ధికి సహకరించాలి'

పరకాల : పెరుకల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని పెరుకల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహణ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంగాని మల్లీశ్వర్, రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు చింతం లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం పట్టణంలోని సాయినగర్‌కాలనీలో పెరుకల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఉమ్మడి పాలనలో పెరుకలకు పూర్తిగా అన్యాయం జరిగిందన్నారు. వ్యాపార అనుభవం కలిగిన పెరుకల కులానికి ఆర్థిక పరమైన వ్యాపార సహకారాన్ని అందించాలని కోరారు. జిల్లాకు సంబంధించిన పెరుకల ఎన్నికలను 6న వరంగల్ శివనగర్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. పెరుక కులస్థులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బరుపాటి వంశి, తిప్పాని సతీష్ పాల్గొన్నారు.

పొచమ్మగుడి నిర్మాణానికి విరాళాల సేకరణ

దుగ్గొండి : మండలంలోని మహ్మదాపురంలో పొచమ్మగుడి నిర్మాణానికి సోమవారం దాతలు గ్రామాభివృద్ధి కమిటీకి విరాళాలు అందించారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గంటరాజిరెడ్డి,పూలమ్మ దంపతులు రూ.50116, పాలడుగుల రవి రూ.5116 విరాళాలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సారంగపాణీ, ఉపసర్పంచ్ శంకర్, సొసైటీ ఉపాధ్యక్షుడు బాబు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ చంద్రమౌళి, కుమారస్వామి, కామశోభన్‌బాబు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన కార్యదర్శిగా రవీందర్

పరకాల రూరల్ : భారతీయ జనతాపార్టీ దళిత మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని వెల్లపల్లి గ్రామానికి చెందిన పెండల రవీందర్‌ని నియమిస్తున్నామని బీజేపి దళిత మోర్చ జిల్లా అధ్యక్షుడు పంజా వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా మ హేందర్ మాట్లాడుతూ నా నియమకానికి సహకరించిన బీజేపి జిల్లా అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెరెడ్డి, పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి,కృతజ్ఞతతెలిపారు.

కొట్టిన కేసులో ఐదుగురిపై కేసు నమోదు

దుగ్గొండి: మండలంలోని తిమ్మంపేట గ్రామానకి చెందిన గొల్లెన రాజు, ఐలుమల్లులను కొట్టిన కేసులో అదే గ్రామానకి చెందిన శివరాత్రి సారయ్య, సాంబయ్య, రవి, కుమార్, రాజయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 26న డబ్బుల విషయంలో గొడవ పడి కొట్టగా రాజు, ఐలుమల్లులు ఆస్పత్రిలో చికిత్స పొంది సోమవారం పిర్యాదు చేయగా కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట



గూడెప్పాడ్ విట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు : విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, కోట్లు కేటాయించి కార్పొరేట్ విద్యను అందిస్తున్న ఘన త కేసీఆర్‌కే దక్కుతుందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గూడెప్పాడ్ గ్రామంలోని విట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో టీఆర్‌ఎస్‌వీ జి ల్లా కార్యదర్శి అర్షం మధుకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగరహిత రా ష్ట్రంగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. సదస్సులో విట్స్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్‌గౌడ్, గూడెప్పాడ్ మార్కెట్ చైర్మన్ బండిరజినీకుమార్,ఆత్మకూరు,సంగెం మండ ల అధ్యక్షులు కానుగంటి సంపత్‌కుమార్, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, ఆత్మకూరు పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కాంతాల కేశవరెడ్డి, టీఆర్‌ఎస్ జిల్లా నాయకులు పొల్సాని అనిల్‌రెడ్డి, రమణారెడ్డి, సాంబయ్యగౌడ్, సర్పంచ్ పాల్గొన్నారు.

సినిమాలు

● నర్సంపేట

రాంరాజ్: శమంతకమణి

జయశ్రీ : దువ్వాడ జగన్నాథవ్

అరవింద : నిన్నుకోరి

● పరకాల

జయ డీలక్స్: ఫిదా

కాకతీయ: గౌతమ్‌నందా

నటరాజ్ : దండుపాళ్యం-2

బోరు ధ్వంసంపై కేసు నమోదు

దుగ్గొండి: మండలంలోని మదిర గ్రామంలో కాలె కట్టయ్యకు చెందిన బోరు బావిని ధ్వంసం చేసిన కేసులో అదే గ్రామానకి చెందిన బొమ్మన కుమార స్వామిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపారు. బోరును రాళ్లు వేసి ధ్వంసం చేసినట్లు కుమారస్వామిపై కట్టయ్య పిర్యాదు చేయగా కేసు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఖతర్నాక్ కి'లేడీ' ఆటకట్టు

ఫేస్‌బుక్‌లో మోసాలకు పాల్పడుతున్న మాయలేడి ప్రత్యూషరెడ్డి అరెస్టు

కానిస్టేబుల్‌గా చెప్పుకుంటూ పలువురి నుంచి డబ్బుల వసూళ్లు

రూ.24వేలు, ద్విచక్ర వాహనం, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న డబ్బు, వస్తువులు



సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యూషను అరెస్టు చూపుతున్న పోలీసులు

వరంగల్ అర్బన్ క్రైం: పోలీసు కానిస్టేబుల్ పేరుతో ఫేస్‌బుక్‌లో పలువురిని బురిడీ కొట్టిస్తూ మోసాలకు పాల్పడుతున్న ఓమాయలేడిని పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రానికి చెందిన పోలెపల్లి ప్రత్యూషరెడ్డి ఫేస్‌బుక్‌ను ఆధారం చేసుకొని దర్జాగా మోసాలకు తెగబడిన వైనం ఆశ్చర్యం గొలుపుతోంది. తాను పోలీసు ఉద్యోగం చేస్తున్నానని... చాలా కష్టాల్లో ఉన్నానని... కొంత డబ్బు సహాయం చేస్తే తిరిగి కొద్ది రోజుల్లో ఇస్తానని నమ్మబలుకుతూ ఆమె అనేక మంది నుంచి డబ్బులు దండుకుని టోపీ పెట్టినట్టు తేలింది. బాధితుల ఫిర్యాదుతో హన్మకొండ సుబేదారి పోలీసులు సోమవారం ఆమెను అరెస్టు చేసి రూ.24వేల నగదుతో పాటు ద్విచక్రవాహనం, 7సెల్‌ఫోన్లు, రెండు పోలీసు యూనిఫాంలు, నకిలీ పోలీసు గుర్తింపు కార్డులు, ఏటీఎం కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

హన్మకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో సీఐ అనుముల శ్రీనివాస్ సోమవారం మీడియా ముందు నిందితురాలిని ప్రవేశపెట్టి వివరాలను వెల్లడించారు. ఖమ్మంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రత్యూష ఎంకాం పూర్తి చేసింది. ఆరు సంవత్సరాల క్రితమే ఫేస్‌బుక్ అకౌంట్ ఓపెన్ చేసి గోదావరిఖనికి చెందిన దళిత యువకుడిని ప్రేమవివాహం చేసుకుంది. ఆమె తల్లిదండ్రులు నిరాకరించడంతో హన్మకొండలో అద్దెకు ఉండేవారు. ఇద్దరి మధ్య కొన్ని రోజులకు వివాదం తలెత్తడంతో విడిపోయారు. ఆ తర్వాత విశాఖపట్నంకు చెందిన ఈశ్వర్‌రావును ప్రేమ వివాహం చేసుకుంది. ఇద్దరు వరంగల్‌కు వచ్చారు. ఈ క్రమంలో ప్రత్యూష సులభంగా డబ్బు సంపాదించే దారులను వెతకడం మొదలుపెట్టింది.

మోసాల పరంపర..

ఫేస్‌బుక్‌లో ముందుగా విశాఖపట్నంకు చెందిన సుబ్బు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఆర్పీఎఫ్‌లో ఎస్‌ఐగా పరిచయం చేసుకున్నాడు. వాస్తవానికి అతడు కూడా నిరుద్యోగే. డబ్బు సులువుగా సంపాదించేమార్గం కావాలని ప్రత్యూష కోరడంతో నకిలీ పోలీసు అవతారం ఎత్తితే సరిపోతుందని సలహా ఇచ్చాడు. దీంతో ఆమె నకిలీ పోలీసు అవతారం ఎత్తి ఫేస్‌బుక్‌లో మోసాలకు తెరతీసింది. బాపూజీ నగర్‌లో తెలిసినవారి సహాయంతో ఆధార్‌కార్డు తీసుకుంది. ఫేక్ అడ్రస్‌పై ద్విచక్ర వాహనం కొనుగోలు చేసింది. వరంగల్ కమిషనరేట్ పరిధిలోని సుబేదారి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పని చేస్తున్నట్టు రెండు నకిలీ పోలీసు గుర్తింపు కార్డులు, రెండు పోలీసు యూనిఫాంలను తీసుకుంది. అనేక మందికి ఫ్రెండ్ రిక్వెస్టులు పంపుతూ ఫ్రెండ్స్‌ను చేసుకునేది. అడిగిన వారికి సెల్ నెంబర్లు ఇస్తూ చనువుగా మాట్లాడేది. కొద్దిరోజులకు తనకు రోడ్డు ప్రమాదం జరిగిందని, ఆస్పత్రికి వెళ్లేందుకు డబ్బులు అవసరం ఉన్నాయని నమ్మిస్తూ అర్జెంట్‌గా డబ్బులు కావాలని నమ్మించేది. ఇలా రెండు తెలుగు రాష్ట్రాల్లో చాలా మంది వద్ద డబ్బులు గుంజినట్టు సీఐ చెప్పారు.

జగిత్యాల జిల్లా పెగడపెల్లికి చెందిన బొమ్మెన అనిల్ దుబాయ్‌లో ఉంటున్నాడు. అతడితో ప్రత్యూషరెడ్డి తాను సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నానని పరిచయం చేసుకుంది. కొద్ది రోజుల తర్వాత రోడ్డు ప్రమాదంలో కాలుకు దెబ్బ తగిలిందని మెడికల్ కట్టుకట్టుకుని డబ్బులు సహాయం చేయాలని ఫేస్‌బుక్‌లో నమ్మించింది.దీంతో అనిల్ మానవతా హృదయంతో తన తమ్ముడు స్వామి అకౌంట్‌లో డబ్బులు వేసి వెస్టర్న్ మనీ ట్రాన్స్‌ఫర్ నుంచి డ్రాచేసి ఆర్ట్స్ కళాశాల వద్ద రెండు మాసాల క్రితం రూ.70వేల నగదును ఇచ్చాడు. అయితే వాయిదా ప్రకారం డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో పాటు సెల్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో వారికి అనుమానం వచ్చింది.

ఈ ఘటనపై జూలై 8న అనిల్ సోదరుడు స్వామి సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు చాలా రోజుల పాటు దర్యాప్తు చేసి చివరికి సోమవారం అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిజం ఒప్పుకోవడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రత్యూషరెడ్డి నుంచి సుమారు రూ.2లక్షల సొత్తు, నగదుతో పాటు ఏటీఎం కార్డులు, రెండు నకిలీ పోలీసు గుర్తింపు కార్డులను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితురాలిని రిమాండుకు తరలిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ సతీష్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యూష వలలో పోలీసులు..!



ఫేస్‌బుక్ ఆధారంగా రెండు ఏటీఎంల ద్వారా డబ్బులు వాడుకుంటూ రెండు తెలుగు రాష్ట్రాల్లో చాలా మందిని మోసం చేసినట్టు పోలీసులు కనుగొన్నారు. ప్రధానంగా పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లు, బ్యాంకు సిబ్బంది పడ్డట్టు పోలీసులు గుర్తించారు. కానీ, విచారణాధికారులు విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డట్టు తెలుస్తోంది. స్నేహం చేసిన వారితో కలివిడిగా ఉండి ఫొటోలు, వీడియోలు చిత్రీకరించి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడేదని పోలీసుల విచారణలో వెల్లడించినట్టు సమాచారం. పోలీసు అధికారుల పిస్తోల్‌తో ఫొటోలు దిగడం, స్పెషల్ పార్టీ పోలీసుల ఎస్‌ఎల్‌ఆర్ గన్స్ పట్టుకుని ఫొటోలకు ఫోజులివ్వడంపై పోలీసులు సాక్ష్యాలు సేకరించారు. ఫేస్‌బుక్‌లో 1,275 మంది స్నేహితులు ఉన్నట్టు ప్రత్యూష స్వయంగా పేర్కొంది.

పోలీసులకు దొరికిన సమయంలో విశాఖపట్నంలోని ఆమె గదిలో ఏడు సెల్‌ఫోన్లు, 30 సిమ్‌కార్డులు లభించినట్టు విశ్వసనీయ సమాచారం. సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్టు స్నేహితుల ద్వారా తెలుసుకుని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో పర్యటిస్తూ టెక్నాలజీకి సైతం చిక్కకుండా తప్పించుకుని తిరిగినట్టు పోలీసులు వెల్లడించారు.డైరెక్టు సెల్ నుంచి వాట్సాప్, ఫేస్‌బుక్ వాడితే పోలీసులకు బుక్ అవతామని గుర్తించి ఒక సెల్ నుంచి సిమ్ కార్డు లేకుండా మరో సెల్‌తో నెట్‌వర్క్‌ను వినియోగించింది. విశాఖపట్నంలో ఫ్రీ వైఫై ఉన్న ప్రదేశానికి చేరుకుని సోషల్ మీడియాను వాడుకునేది. 22 రోజులుగా సుబేదారి పోలీసులకు కొరకరాని కొయ్యగా మారింది. చివరికి పోలీసు సైబర్ శాఖ సహాయంతో విశాఖపట్నంలోని గోదావరి కాలనీలో అరెస్టు చేసి తీసుకొచ్చినట్టు సమాచారం. ఇంకా ప్రత్యూషరెడ్డితో ఎవరికి సంబంధాలు ఉన్నాయి? ఎన్ని బ్యాంకుల్లో అకౌంట్స్ కలిగి ఉందనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం.

'వరంగల్ జిల్లా' వైపే మొగ్గు?

రూరల్ జిల్లా రద్దు అవుతుందని ప్రచారం

కలెక్టరేట్‌కు ఇబ్బందిగా భౌగోళిక స్వరూపం

జయశంకర్‌లో కలుస్తామంటున్న 'పరకాల'

సీఎం తుది నిర్ణయంపైనే అందరి చూపు..

■ ఆంధ్రజ్యోతి, వరంగల్ రూరల్

వరంగల్ రూరల్ జిల్లా కలెక్టరేట్ కొట్లాట అసలుకే మోసం తెచ్చేలా మారింది. రూరల్ జిల్లా కలెక్టరేట్ అంశంపై చర్చ జరుగుతుండగానే.. పూర్తిగా జిల్లానే రద్దు చేసి తమను సమీప జిల్లాలో కలపాలనే డిమాండ్ ముందుకు రావడం కలకలం రేపుతోంది. గత ఏడాది అక్టోబర్‌లో నర్సంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాలు, వర్ధన్నపేట నియోజకవర్గంలోని రెండు మండలాలు, పరకాలలోని ఐదు మండలాలు, పాలకుర్తిలోని ఒక మండలం, భూపాలపల్లిలోని ఒక మండలంతో మొత్తం 15 మండలాలతో కలిపి వరంగల్ రూరల్ జిల్లాను ఏర్పాటు చేశారు.

జిల్లా ఆవిర్భావం నుంచే పాత పరకాల తాలుకాను రెవెన్యూ డివిజన్‌గా చేయాలంటూ ఆందోళనలు కొనసాగుతూ వస్తున్నాయి. ప్రస్తుతం రూరల్ కలెక్టరేట్‌ను అర్బన్ జిల్లాలో ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్న నేపథ్యంలో పరకాలను జయశంకర్ జిల్లాలో కలపాలంటూ స్థానిక నేతలు కొత్త వాదనను ముందుకుతెచ్చారు. పరకాలలో కలెక్టరేట్ ఏర్పాటు కాకపోవడం, రెవెన్యూ డివిజన్ డిమాండ్ బలంగా ఉండడంతో పరకాలను రెవెన్యూ డివిజన్ చేస్తూ రూరల్ జిల్లా నుంచి వేరు చేసి జయశంకర్ జిల్లాలో కలపాలని ఎమ్మెల్యే ధర్మారెడ్డి సైతం ముందుకు రావడం చర్చనీయాంశంగా మారింది. వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని వరంగల్ రూరల్ జిల్లాలో కలిపి, పరకాలను జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కలిపితే సమస్య సద్దుమణిగిపోతుందని వాదిస్తున్నారు.

అయితే ఈ మార్పులు జరిగితే రాయపర్తి మండలం జనగామ జిల్లాకు, శాయంపేట మండలం జయశంకర్ జిల్లాకు, నెక్కొండ, ఖానాపురం మండలాలు మానుకోటకు వెళ్లే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. జిల్లాలో మిగిలిన నర్సంపేటను వరంగల్ అర్బన్‌లో కలుపడం ద్వారా వరంగల్ ఒకటే జిల్లాగా మార్చవచ్చనే ప్రచారం జోరందుకుంది.

మొదటి నుంచే సమస్య..

కొత్త జిల్లాల ఆవిర్భావం నాటి నుంచే వరంగల్ రూరల్ జిల్లా మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లాను ఐదు భాగాలుగా చేయడం తథ్యమని భావించిన తరుణంలో నగరం కేంద్రంగా వరంగల్, హన్మకొండ జిల్లాలు ఏర్పాటు చేస్తామని పేర్కొంటూ తొలి ముసాయిదాను ప్రభుత్వం విడుదల చేసింది. నేతల మధ్య ఆధిపత్య పోరు కారణంగా ఆ ప్రతిపాదన వెనక్కిపోయింది. ఆ తర్వాత వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాలు తెరపైకి తెచ్చి రూరల్ జిల్లాకు కేంద్రం ఎక్కడో పేర్కొనకుండానే జిల్లా ఏర్పాటు చేశారు. ఇప్పుడు అదే అధికార పార్టీకి పెద్ద తలనొప్పిని తెచ్చిపెట్టింది. జిల్లా కేంద్రాన్ని తమ దగ్గర ఏర్పాటు చేయాలంటే... తమ దగ్గరంటూ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నేతలు, సంఘాలు విడిపోయి నెల రోజులుగా ఆందోళనలను తీవ్రతరం చేశారు.

జిల్లాలో పరిస్థితి చేయి దాటిపోయేలా ఉందనే విషయాన్ని గ్రహించిన అధినేత సమస్యను సద్దుమణిగేలా చేసేందుకు ప్రయత్నం చేశారు. రూరల్ కలెక్టరేట్‌ను అర్బన్ జిల్లాలోనే కొనసాగించేందుకు రంగం సిద్ధం చేశారు. ఒకే నగరంలో రెండు కలెక్టరేట్లు ఉండడం మూలంగా రెండు ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయనే ఉద్దేశంతో కేసీఆర్ ఆ దిశగా ఆలోచన చేశారు. అర్బన్ జిల్లాలోని లక్ష్మీపురం రెవెన్యూ గ్రామ శివారులోని ఆజంజాహి మిల్లుకు సంబంధించిన 27 ఎకరాల స్థలంలో కలెక్టరేట్ నిర్మించడానికి రూరల్ జిల్లా ఎమ్మెల్యేలు, నేతలంతా సరే అనడంతో సీఎం కేసీఆర్ సైతం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

రహస్యంగా సర్వే..

ఆజంజాహిలో కలెక్టరేట్ నిర్మించడానికి జిల్లా నేతలంతా సమ్మతించారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా మళ్లీ సమస్య మొదటికి తెచ్చింది. అర్బన్‌లోని తూర్పు నియోజకవర్గాన్ని కలిపే అంశం తెర మీదకి రావడంతో హన్మకొండ ప్రాంతంలోని కొన్ని సంఘాలు ఆందోళన బాట పడతామంటూ బయలుదేరారు. వరంగల్ నగరంలోని నేతలు మాత్రం కలెక్టరేట్ రావడం ద్వారా అభివృద్ధి చెందుతుందని అంటుండగా, దీన్ని మళ్లీ రచ్చ చేసి లబ్ధి పొందడానికి కొందరు ప్రయత్నం చేస్తున్నట్టు నిఘా సంస్థలు నివేదికలో పేర్కొన్నట్టు తెలిసింది. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో రెండు రోజులుగా నిఘా సంస్థలు, వరంగల్ రూరల్ జిల్లాలో ఈస్ట్‌ను కలిపితే ఎలా ఉంటుందనే అంశంపై సర్వే చేసినట్టు తెలిసింది. ఈ సర్వేలో ఈస్ట్‌తో కూడిన జిల్లాకు అనుకూలంగానే రావడంతో ఆ నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్టు తెలిసింది.

మంథని ఎమ్మెల్యే సతీమణికి గాయాలు

కమలాపూర్ బ్రిడ్జి వద్ద

పుట్ట శైలజ వాహనాన్ని ఢీకొన్న లారీ

కృష్ణకాలనీ(భూపాలపల్లి): మంథని ఎమ్మెల్యే సతీమణి, మంథని మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పుట్ట శైలజ ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వల్పగాయాలకు గురయ్యారు. వివరాలిలా ఉన్నాయి. వరంగల్‌లో బంధువుల వివాహానికి ఆదివారం హాజరైన ఆమె రాత్రి తిరుగు ప్రయాణమైంది. ఈ క్రమంలో భూపాలపల్లి సమీపంలోని కమలాపూర్ బ్రిడ్జి వద్దకు చేరుకోగానే ఆమె ప్రయాణిస్తున్న వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో ఒక్కసారిగా పల్టీ కొట్టింది. ఈ సంఘటనలో నుంచి శైలజతో పాటు డ్రైవర్ మహేష్ స్వల్పగాయాలతో బయటపడ్డారు.



ప్రమాదానికి గురైన పుట్ట శైలజ వాహనం

బైక్‌తో భార్యను ఢీకొట్టి హతమార్చిన భర్త

ములుగు టౌన్ (జయశంకర్ జిల్లా) : అనుమానమే పెనుభూతమై ఓనిండు ప్రాణాన్ని బలితీసుకుంది. కడవరకు కంటికి రెప్పలా కాపాడుకుంటూ కలిసి జీవిస్తానని ప్రమాణం చేసిన భర్త ద్విచక్ర వాహనంతో ఢీకొట్టి భార్యను కడతేర్చిన సంఘటన ములుగులో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట మండలం మహేశ్వరం గ్రామానికి చెందిన బొంతలయాదయ్య-సుమలతకు ఆరేళ్ల క్రితం వివాహం కాగా, ఇద్దరు పిల్లలు కలిగారు. బతుకు దెరువు కోసం గత ఏడాది ములుగుకువచ్చిన దంపతులు ఎస్ఎస్ బ్రాం దీ షాపు సమీపంలో చిన్న హోటల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.

అయితే భర్త యాదగిరి అనుమానంతో సుమలతను నిత్యం వేధిస్తుండేవాడు. ఇరువురి మధ్య జరుగుతున్న గొడవలతో గత కొన్ని మాసాలుగా దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో సోమవారం యాదగిరి భార్య సుమలతకు ఫోన్ చేసి తాను పురుగుల మందు తాగానని అనడంతో వెంటనే ఏరియా వైద్యశాలకు వెళ్లి విచారించింది. అక్కడ యాదగిరి లేకపోవడంతో తమ హోటల్‌కు వెళ్తుండగా పోలీస్ స్టేషన్ సమీపంలోకి రాగానే ఆ పరిసరాల్లో కాపు కాసిన యాదగిరి ద్విచక్ర వాహనంపై అతి వేగంగా వచ్చి సుమలతను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ సుమలతను 108 వాహనంలో స్థానిక ఏరియా వైద్యశాలలో చేర్పించగా పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స చేస్తుండగా సుమలత మృతి చెందింది. ఈ ఘటనపై ములుగు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



సుమలత మృతదేహం

అన్నీ ఇచ్చేది చెట్టమ్మ తల్లి

చెట్లతోనే మానవాళి మనుగడ

శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్

ఎలుకుర్తి, ఆరెపల్లి గ్రామాల సర్పంచ్‌లకు స్వామిగౌడ్ అభినందన

గీసుగొండ (వరంగల్ రూరల్ జిల్లా) : అడగనిదే అమ్మ కూడా అన్నం పెట్టదు... కానీ, అడగకుండానే అందరికి అన్నీ ఇచ్చేది చెట్టమ్మ తల్లి అని శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. మండలంలోని ఆదర్శ గ్రామమైన ఎలుకుర్తి హవేలిలో సోమవారం హరితహారంలో భాగంగా మొక్కలు నాటి రూ.10 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్వామిగౌడ్ పాల్గొని మాట్లాడారు.

చెట్లతోనే మానవాళి మనుగడ కొనసాగుతందని వాటి ప్రాముఖ్యతను వివరించారు. అందుకోసమే రాష్ట్ర ప్రభుత్వం బంగారు తెలంగాణ కోసం మూడో విడత హరితహారం ద్వారా ఈ సంవత్సరం 4కోట్ల మొక్కలు నాటే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఇందులో ప్రతీ ఒక్కరు భాగస్వాములై పది మొక్కలు నాటాలన్నారు. అభివృద్ధి పనుల్లో ఆదర్శంగా నిలుస్తున్న ఎలుకుర్తి, ఆరెపల్లి గ్రామాలకు తన నిధులనుంచి రూ.5లక్షల చొప్పున మంజూరు చేయిస్తానని స్వామిగౌడ్ హామీ ఇచ్చారు. ఎలుకుర్తి, ఆరెపల్లి గ్రామాల సర్పంచ్‌లు భీమగాని సౌజన్య, తుమ్మనపల్లి శ్రీనివాస్‌ను అభినందించారు. రాజకీయాలతో ప్రమేయం లేకుండా గ్రామాల అభివృద్ధికి ప్రజలందరు సమష్టిగా కృషి చేయాలని కోరారు.

ఎమ్మెల్యే ధర్మారెడ్డి మాట్లాడుతూ పరకాల నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, బేవరేజస్ చైర్మన్ దేవీప్రసాద్‌రావు, టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు కారెం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేందర్, ఎంప్లాయిస్ జాక్ సుబ్బారావు, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు రత్నవీరాచారి, ఎంపీపీ ముంత కళావతి, జడ్పీటీసీ ఆంగోతు కవిత, వైస్‌ఎంపీపీ కామని భాస్కర్, సర్పంచ్‌లు భీమగాని సౌజన్య, శ్రీనివాస్, ఎంపీడీవో సాయిచరణ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఏపీవో మోహన్‌రావు, పీఏసీఎస్ చైర్మన్లు సద్ది తిరుపతిరెడ్డి, కక్కెర్ల శ్రీనివాస్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోలీస్ ధర్మారావు, కార్యదర్శి పుండ్రు జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా, నిరక్షరాస్యత నిర్మూలన కోసం ఎనిమిదేళ్లుగా పని చేస్తున్న సాక్షరభారత్ మండల, గ్రామ కోఆర్డినేటర్ల వేతనాలు పెంచాలని కోరుతూ ఆ సంఘం నాయకులు మండలి చైర్మన్ స్వామిగౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో వేల్పుల సురేష్, గోపి తదితరులు ఉన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్

జయశంకర్ జిల్లా ఇన్‌చార్జి డీఈవోగా గౌతమ్

ములుగు సబ్ కలెక్టర్‌కు అదనపు బాధ్యతలు

భూపాలపల్లిటౌన్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారిగా ములుగు సబ్ కలెక్టర్ వీపీ గౌతమ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ మురళి ఆదేశాలతో ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన వరంగల్ రూరల్ జిల్లా డీఈవో నారాయణరెడ్డి ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పుకుని సబ్ కలెక్టర్‌కు చార్జి అప్పగించారు. దీంతో సోమవారం నుంచి సబ్ కలెక్టర్ వీపీ గౌతమ్ అదనంగా విద్యాశాఖ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. నారాయణరెడ్డి రూరల్ జిల్లాలో పనిచేస్తూ ఇక్కడికి రావడానికి పనిభారంగా ఉండడంతో ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ఇబ్బందికరంగా మారింది. దీంతో కలెక్టర్ మురళి ఆదేశాలతో ఈ నిర్ణయం తీసుకున్నారు.



వీపీ గౌతమ్

కుటుంబ తగాదాలతో వ్యక్తి ఆత్మహత్య

దహన సంస్కారాల కోసం ముందే రూ.25వేలు డ్రా

చనిపోతున్నానని తండావాసులకు చెప్పిన నర్సింహ

గూడూరు రూరల్(మహబూబాబాద్ జిల్లా) : గూడూరు మండలం మచ్చర్ల గ్రామ శివారు రేగడితండాకు చెందిన బానోత్ నర్సింహ (50) అనే వ్యక్తి కుటుంబ తగాదాలతో సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బానోత్ నర్సింహ, భార్య రాజమ్మ, కుమారులు నాగుర్ బాబు, దేవీలాల్‌ల మధ్య కొంతకాలంగా తగాదాలు జరుగుతున్నాయి. మూడు రోజుల క్రితం కొడుకులు తనను పట్టించుకోవడం లేదని నర్సింహ గూడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కోపోద్రిక్తులైన భార్య రాజమ్మ, చిన్న కుమారుడు దేవీలాల్ ఘర్షణ పడి చేయి చేసుకున్నారు. ఇదిలా ఉండగా నేను చనిపోతున్నానని గ్రామంలో పలువురికి చెప్పి బ్యాంకు నుంచి రూ.25వేలు డ్రా చేశాడు. దహన సంస్కారాల కోసం ఉపయోగించే సామగ్రి, బ్యాంకులో విడిపించిన డబ్బులను తీసుకుని నేరుగా ఇంటికి వెళ్లి కేసముద్రంలో ఉండే కూతురు భర్త లక్‌పతికి చనిపోతున్నానని, బీరువాలో ఉన్న డబ్బులు దహన సంస్కారాలకు వినియోగించాలని తెలిపాడు. దీంతో అల్లుడు లక్‌పతి తండాకు వచ్చేసరికి నర్సింహ ఉరేసుకున్నారు. ఈ సమాచారాన్ని అల్లుడు కుటుంబ సభ్యులకు చేరవేశాడు. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు.



నర్సింహ మృతదేహం

గాంధీ ఆస్పత్రి లో బాలిక ప్రసవం

హైదరాబాద్ : చదువుకోవాల్సిన బాలిక తల్లి అయింది. పెళ్లి చేసుకుంటానని బాలుడు మోసం చేయడంతో గాంధీ ఆస్పత్రిలో శిశువుకు సోమవారం జన్మనిచ్చింది. ఆస్పత్రి సిబ్బంది అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వరుసకు మేనబావ అయిన బాలుడిపై కేసు నమోదు చేశారు. వరంగల్ జిల్లాకు చెందిన బాలిక తల్లిదండ్రులు వెంకటాపురం వచ్చి నివసిస్తున్నారు. బాలిక ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. మేనమామ కుమారుడు ఆమెపై కన్నేసి మాయమాటలు చెప్పి అత్యాచారం చేశాడు. తాము బంధువులమని.. బాలికను వివాహం చేసుకుంటామని.. కేసు నమోదు చేయవద్దని మైనర్ల తల్లిదండ్రులు పోలీసులను కోరారు.

నేడు రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి పర్యటన

మట్టెవాడ(వరంగల్) : వరంగల్ అర్బన్ జిల్లాకు మంగళవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి రానున్నారు. నగరంలో జరిగే హరితహారం, ప్రపంచ ఆటో డ్రైవర్ల బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఉదయం 8.30 గంటలకు జనగామ రవాణా శాఖ కార్యాలయంలో హరితహారంకార్యక్రమంలో మొక్కలు నాటుతారు. ఉదయం 11 గంటలకు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో హరితహారం కార్యక్రమంలో పాల్గొంటారు. 11.45 గంటలకు వరంగల్ అర్బన్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో హరితహారం కార్యక్రమంలో పాల్గొంటారు. 12.30 గంటలకు ఆర్టీసీ జోనల్ స్టాఫ్‌ట్రైనింగ్ కార్యాలయంలో మొక్కలు నాటుతారు. ఒంటిగంటకు ఆటోడ్రైవర్ల బహిరంగ సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు వరంగల్ రూరల్ జిల్లాలోని నర్సంపేటలో హరితహార కార్యక్రమంలో పాల్గొంటారు.

రవాణా శాఖ కార్యాలయంలో ఏర్పాట్లు

మంత్రి మహేందర్‌రెడ్డి మొదటి సారిగా వరంగల్ రవాణా శాఖ కార్యాలయానికి రానున్నారు. ఇందుకుసంబంధించి కార్యాలయ ఆవరణలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలను మంత్రి నాటనున్నారు. కార్యాలయంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీటీసీ శివలింగయ్య తెలిపారు.

కలెక్టరేట్ కోసం కొనసాగుతున్న ఆందోళనలు

వర్ధన్నపేటలో ఆరో రోజుకు చేరిన దీక్షలు ● నర్సంపేటలో టీడీపీ ఒక రోజు దీక్ష

వరంగల్ రూరల్, ఆంధ్రజ్యోతి : వరంగల్ రూరల్ జిల్లాలో కలెక్టరేట్ ఏర్పాటు విషయమై ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. నియోజకవర్గ కేంద్రమైన వర్ధన్నపేటలో అఖిలపక్షం చేపట్టిన దీక్షలు ఆరో రోజుకు చేరాయి. నియోజకవర్గంలోని మామునూరు వద్ద కలెక్టరేట్ నిర్మాణం చేపట్టాలంటూ వర్ధన్నపేటలో దీక్షలు కొనసాగుతుండగా సోమవారం టీడీపీ నాయకులు తూళ్ల కుమారస్వామితో కలిసి సందర్శించి పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ రూరల్ జిల్లా కేంద్రాన్ని నగర శివారులోని మామునూరు, తిమ్మాపూర్ ప్రాంతాల్లోనే ఏర్పాటు చేయాలన్నారు. దీంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందడానికి అనువుగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం అభిప్రాయ సేకరణ జరపకుండా ప్రజల మనోభావాలను దెబ్బతీస్తూ జిల్లాల విభజన చేసి ఆటలాడుకుంటుందన్నారు. అలాగే జిల్లా కేంద్రాన్ని నర్సంపేటలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ టీడీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో సోమవారం ఒక రోజు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు మామిండ్ల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ నర్సంపేట డివిజన్ కేంద్రంతో పాటు పర్యాటక, విద్యా కేంద్రంగా ఉందన్నారు. జిల్లా పరిధిలోని అన్ని మండలాలకు నర్సంపేట కేంద్రంగా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం రాజకీయంగా ఆలోచించకుండా అన్ని ప్రాంతాలకు కేంద్రమైన నర్సంపేటలో జిల్లా కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి 9 పరకాల
వరంగల్ రూరల్ । మంగళవారం 1 ఆగస్టు 2017
। పరకాల । శాయంపేట । దామెర । ఆత్మకూరు । గీసుగొండ । సంగెం ।

'చలివాగు నీటి చౌర్యానికి పాల్పడితే చర్యలు'

శాయంపేట: మండలంలోని జోగంపల్లి శివారులోని చలివాగు ప్రాజెక్టు నుంచి రైతులు నీటి చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఐబీ ఏఈ రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు గానూ 3042 ఎకరాలకు సాగునీరు అందిస్తున్న క్రమంలో చివరి ఆయకట్టు రేగొండ మండలం దమ్మన్నపేట వరకు నీళ్లు కాలువల ద్వారా వెళ్లాల్సి ఉందని తెలిపారు. అయితే రైతులు మోటార్లు పెట్టి నీటి చౌర్యానికి పాల్పడం మూలంగా చివరి ఆయకట్టుకు నీళ్లు వెళ్లడం కష్టంగా మారిందని, దీంతో పంటలు సాగుచేస్తున్న రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. చౌర్యానికి పాల్పడితే రైతుల మోటర్లను స్వాధీనం చేసుకుంటామని ఆయన హెచ్చరించారు.

భూపాలపల్లి జిల్లాలో కలపాలి

విలేకరుల సమావేశంలో పరకాల అఖిలపక్ష నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

పరకాల : పరకాల పట్టణాన్ని భూపాలపల్లి జిల్లాలో కలిపినా సరిపోతుందని అఖిలపక్ష నాయకులు అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో పరకాల అఖిలపక్షం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత తాలూకాను కలుపుకొని రెవెన్యూ డివిజన్ లేదా రూరల్ జిల్లా కలెక్టరేట్ అది కాకున్నా భూపాలపల్లి జిల్లాలో కలిపినా న్యాయం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే ధర్మారెడ్డి సాధన సమితిని ఏర్పాటు చేసుకొని వారిని హైదరాబాద్‌కు రమ్మని వినతిపత్రం ఇప్పించుకొని పరకాలకు ఏదో న్యాయం చేస్తున్నట్లు వ్యవహరిస్తున్నారన్నారు. అయిపోయిన జిల్లా కేంద్రానికి గొడవ ఎందుకని ఎద్దేవా చేయడం సరైందికాదన్నారు. పరకాలను ఏవిధంగా అభివృద్ధి చేస్తారో ఎమ్మెల్యే చెప్పాల్సి ఉందన్నారు. న్యాయం జరిగే వరకు పోరాటాలు, ఉద్యమాలు, నిరసనలు ఆగేది లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు పిట్ట వీరస్వామి, కొల్గూరి రాజేశ్వర్‌రావు, నక్క చిరంజీవి, బొచ్చు కృష్ణారావు, ఏకు సాంబయ్య, కానుగుల గోపీనాథ్, రాజమౌళి తదితరులు ఉన్నారు.

రాజకీయ స్వార్థం కోసం విడదీయొద్దు...

శాయంపేట: రాజకీయ స్వార్థం కోసం ప్రజలను విడదీయొద్దని కోరుతూ టీజేఏసీ డివిజన్ కన్వీనర్ దామెర రవీందర్ హన్మకొండలో రూరల్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో జేసీ హరితకు వినతి పత్రం అందజేశారు. ప్రజల అభిప్రాయాలతో సంబంధం లేకుండా 31 జిల్లాలు చేసి ఇప్పుడు మళ్లీ జిల్లాల గొడవ తెరపైకి తీసుకువచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కాశేశ్వరం నర్సయ్య, గడ్డమీది కర్ణాకర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను కాపాడుకోవాలి : ఎంఈవో బ్రహ్మయ్య

సంగెం : ప్రభుత్వ బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులపై ఉందని సంగెం మండల విద్యాధికారి జి.బ్రహ్మయ్య అన్నారు. సోమవారం మండలంలోని వంజరపల్లి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో జరిగిన విజయ్‌కుమార్ అనే ఉపాధ్యాయుడి పదవీ విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కిరణ్ కుమార్, సర్పంచ్ కొడగాని శంకర్‌రావు, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ సోమిడి శ్రీనివాస్, ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్‌గా భరత్

గీసుగొండ : కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడిగా గీసుగొండ గ్రామానికి చెందిన దౌడు భరత్‌ను పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జి ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ఆదేశానుసారంగా నియమించినట్లు మండలాధ్యక్షుడు డోలి చిన్ని తెలిపారు. నియామక పత్రాన్ని సోమవారం భరత్‌కు అందచేసినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ పరకాల నియోజకవర్గ అధ్యక్షుడు కర్లకంటి రఘు, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ నిలిపివేత

పరకాల : పట్టణంలోని వెల్లంపల్లిరోడ్డు మార్గంలో మంగళవారంనాలుగు గంటల పాటు విద్యుత్ నిలిపివేస్తామని నగరపంచాయతీ చైర్మన్ మార్త రాజభద్రయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించడం జరుగుతుందని అందులో భాగంగానే ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని అన్నారు. దీనికి పట్టణవాసులు సహకరించాలని కోరారు.

శ్రీహర్ష డైరెక్టర్లకు గురుబ్రహ్మ అవార్డుల ప్రదానం

దామెర : విద్యారంగంలో విశిష్ట సేవలు అందించినందుకు 2017 విద్యా సంవత్సరానికి గాను గురుబ్రహ్మ అవార్డులను మండలంలోని దామెర గ్రామంలోని శ్రీహర్ష హైస్కూల్ డైరెక్టర్లు రాచమల్ల వెంకట్‌రాజు, శివానంద్‌లకు మదర్ థెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రదానం చేసింది. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వారిని యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



అవార్డులు అందుకున్న శ్రీహర్ష హైస్కూల్ డైరెక్టర్లు వెంకట్‌రాజు, శివానంద్

సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్‌కు హమాలీల వినతి

పరకాల : హమాలీల డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ తహసీల్దార్ హరికృష్ణకు సోమవారం హమాలీలు వినతిపత్రాన్ని అందించారు. 30 సంవత్సరాలుగా రెక్కలు ముక్కలు చేసుకుంటున్నా కుటుంబాల పోషణ భారంగా మారుతోందన్నారు. గత నెల 25 నుంచి నిరాహార దీక్షలు చేస్తున్నామని, హమాలీలకు కనీస వేతనాలు అందిస్తూ నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. హమాలీల సమస్యలను ప్రభుత్వానికి విన్నవించేందుకు హైదరాబాద్‌కు మంగళవారం వెళ్తామన్నారు. కార్యక్రమంలో చంద్రమౌళి, సుధాకర్, కర్ణాకర్, మహేందర్, గణేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

శాయంపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో తెలంగాణ నెటిజన్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫోరం అధ్యక్షుడు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన చాలా మంది ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలిపారు. పదో తరగతిలో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.5వేల నగదు బహుమతిని అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి సాయి ఈశ్వర్, అమ్మ వేణు, ఎంఈవో పున్నం యాదవరెడ్డి, హెచ్ఎం వెంకటేశ్వర్లు, సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'రవీందర్ సేవలు మరువలేనివి'

పరకాల : సీనియర్ అకౌంటెంట్ ఎస్. రవీందర్ సేవలు మరువలేనివని సబ్‌ట్రెజరీ ఆఫీసర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సబ్‌ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్ రవీందర్ పదవీ విరమణ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ అకౌంటెంట్ సురేష్, అలేఖ్య, ఎస్‌కే సుబానాబేగం, తహసీల్దార్ హరికృష్ణ, వెంకటభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల శుద్ధీకరణ కోసం భూ వివరాల సేకరణ

సంగెం : గ్రామంలోని రైతులను దృష్టిలో పెట్టుకొని భూ వివరాలను ప్రత్యేకంగా సేకరించి క్షేత్ర పరిశీలన చేయనున్నట్లు తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. సోమవారం మండలంలోని చింతలపెల్లి గ్రామ శివారులో గల మంగ్యానాయక్ తండాలో రైతుల భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సంబంధించిన భూ వివరాలను పూర్తి స్థాయిలో సేకరించి వాటి ఆధారంగా క్షేత్ర పరిశీలన చేసి పాస్ బుక్కులను అందించే విధంగా ప్రభుత్వం కొత్త ఒరవడిని ప్రారంభించిందని చెప్పారు. భూ కాగితాలను పరిశీలన చేసి రికార్డులతో సహా సమస్యలున్న వాటిని పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెండో విడతగా కొలతలను సైతం రైతుల ముందే చేయనున్నట్లు తెలిపారు. భూమి సమస్య వివరాలు, సర్వే నెంబర్, టైటిల్ డీడ్ తదితర వివరాలను సేకరించనున్నట్లు తహసీల్దార్ వివరించారు.



వివరాలను సేకరిస్తున్న తహసీల్దార్

ఊరూరా కొనసాగుతున్న హరితహారం

పరకాల రూరల్: పరకాల మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పోచమ్మగుడి ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా యువజన సంఘం అధ్యక్షుడు పూర్ణచందర్ మాట్లాడుతూ హరితహారంలో అందరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో బండారి రమేష్, పసుల సతీష్, దండ్ర ప్రభాకర్, దండ్ర శంకర్, రంజిత్, ప్రకాష్, మొగిళి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన జడ్పీటీసీ...

పరకాల : పట్టణంలోని గణపతి డిగ్రీ కళాశాలలో స్థానిక జడ్పీటీసీ పాడి కల్పనాదేవి సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కల్పనాదేవి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నేతాని సులోచన, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, సీఐ జాన్‌నర్సింహులు, బండి సారంగపాణి, పాడి ప్రతాప్‌రెడ్డి, భాస్కర్, శివుడు, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.



గణపతి డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న జడ్పీటీసీ కల్పనాదేవి

కన్నపిల్లల్లా పెంచాలి...

నాటిన మొక్కలను ఎదిగేంతవరకు కన్నపిల్లల్లా పెంచాలని పరకాల సీఐ జాన్‌నర్సింహులు అన్నారు. సోమవారం పట్టణంలోని జ్యోతి మైనారిటీ పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పాఠశాలలో 200ల మొక్కలు నాటడంతో పాటు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అభినవ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాదాబైనామాలతో భూమి పట్టాలు ఇవ్వాలి

మండల సభలో సర్పంచుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ముంత కళావతి

గీసుగొండ: మ్యాన్యువల్‌గా ఇచ్చిన సాదాబైనామాలతో రైతులకు భూమి పట్టాలు ఇవ్వాలని పలువురు సర్పంచులు డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీపీ ముంత కళావతి అధ్యక్షతన గీసుగొండ మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రభుత్వం రైతులకు ఎరువుల కొనుగోలు కోసం ఎకరానికి రూ. 8 వేలు ఇచ్చే విధంగా ప్రవేశపెట్టిన పథకం రైతులకు అందని ద్రాక్షలా మారిందని సభ దృష్టికి తీసుకువచ్చారు. మ్యాన్యువల్‌గా తీసుకున్న దరఖాస్తులు ఏమైనట్లు అని వారు ప్రశ్నించారు. ఆ దరఖాస్తును పరిశీలించేందుకే రెవెన్యూ గ్రామ సభలను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలట్‌గా తీసుకొని ఆ గ్రామంలో 15 రోజులపాటు రెవెన్యూ అధికారులు సర్వేలు, విచారణలు జరిపి అర్హులైన రైతులకు భూపట్టాలు అందించటం జరుగుతుందన్నారు. ఇదంతా కూడా కంప్యూటరైజ్డ్ అయిన తరువాత కంప్యూటర్ పట్టా పాస్‌బుక్కులు వస్తాయని తెలిపారు. మండలంలోని శాయంపేటను పైలట్ గ్రామంగా తీసుకున్నట్లు చెప్పారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది సరిగా స్పందించకపోవటం వల్ల గ్రామాల్లో కరెంటు సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయని గీసుగొండ సర్పంచ్ కోల కుమారస్వామి సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి గ్రామంలో ఆన్, ఆఫ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండే విధంగా చూడాలన్నారు. హరితహారంలో నాటిన మొక్కలకు నీరు పోసేందుకు కూలీలను నియమించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయిచరణ్, తహసీల్దార్ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ కామని భాస్కర్, ఎంపీటీసీలు ధనలక్ష్మి, శ్రీనివాస్, రవీందర్, మంజుల, సర్పంచులు ధ్వాలీ, మానయ్య, ఈవోపీఆర్డీ రవీంద్రారెడ్డి, ఎంఈవో సుజన్‌తేజ, ఏఈలు ప్రభాకర్, ఆమ్రపాలి, ఏవో శ్రీనివాస్, ఏపీవో మోహన్‌రావు, హెచ్‌డబ్ల్యూవో రవీందర్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటింటి భూ సర్వే : తహసీల్దార్ సరిత

దామెర : రైతులకు చెందిన భూములకు సంబంధించిన వివరాలను సరిచేసేందుకు పహాణీ ప్యూరిఫికేషన్ పేరుతో సర్వే ఈ నెల 1 నుంచి నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బి. సరిత తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని సర్వాపూర్ గ్రామంలో సర్పంచ్ అల్లె శ్రీనివాస్ అధ్యక్షతన సభ జరిగింది. సోమవారం నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా తహసీల్దార్ సరిత హాజరై మాట్లాడారు. భూ సర్వేలో భాగంగా ఇంటింటికీ వెళ్లి పట్టాదారు వివరాలను సేకరించనున్నట్లు తెలిపారు. తద్వారా పట్టా భూముల వివరాలను సేకరించి నివేదిక తయారు చేసి కంప్యూటరైజ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. సర్వే అనంతరం ప్రొసీడింగ్ జారీ చేసి వెబ్ ల్యాండ్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు.

దీంతో ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు వీలుకలుగుతుందని తెలిపారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో భూములపై ఉన్న తగాదాలను సత్వరమే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తహసీల్దార్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో మండల గిర్దావర్ షఫీ అహ్మద్, గ్రామ కో ఆప్షన్ మెంబర్ రఫీ, వీఆర్వోలు రాజు, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అంకుశాపూర్ గ్రామ శివారులోని తండాలో బతుకుదెరువుకు వలసబోయిన కుటుంబాల ఇళ్లకు తాళం వేసి ఉన్న దృశ్యం

వలసలతో తండ్లాట

ఉన్నచోట ఉపాధి కరవైంది... దీంతో కుటుంబ పోషణ బరువైంది. ఎవుసం కలిసి రాక.. ఉపాధిహామీ పనులు దొరకక.. ఒకవేళ దొరికినా సకాలంతో కూలిడబ్బులు చేతికందక కూలీలు నరకయాతన అనుభవిస్తున్నారు. మరోవైపు అప్పులభారం తడిసిమోపెడవుతోంది. ఈక్రమంలో చేసేదిలేక జనగామ జిల్లా పరిధిలోని పలు తండాల నుంచి ప్రజలు నెలకు రూ.10వేలు వచ్చినా చాలనుకొని, కూలి పనులను వెతుక్కుంటూ వివిధ నగరాలకు వలసపోతున్నారు. దీంతో ఆయా ఇళ్లలో పసిపిల్లలు, వృద్ధులు జాడ మాత్రమే కనిపిస్తోంది. కాటికి కాళ్లు చాసిన తమకు చిన్న పిల్లలను అప్పగించి, కొడుకులు, అల్లుళ్లు వలస పోయారంటూ తండాలకు చెందిన వృద్ధులు ఆవేదన వెల్లగక్కుతున్నారు. వారి గుండెఘోషపై ప్రత్యేక కథనమిది.



- తరిగొప్పుల మండలంలోని 32 తండాల్లో ప్రజల వలసబాట
- ఉపాధి కరువై.. కుటుంబ పోషణ బరువై..
- కూలిపనులను వెతుక్కుంటూ నగరాలకు పయనం
- అడ్వాన్సులను ఎరగా వేసి, వలసలను ప్రోత్సహిస్తున్న గుంపుమేస్త్రీలు

తరిగొప్పుల (జనగామ జిల్లా)

జనగామ జిల్లాలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల ప్రభావం ప్రజానీకంపై పడుతోంది. ఇందుకు తార్కాణం తరిగొప్పుల మండలంలోని 32 గిరిజన తండాలు. వాటిలో మొత్తం 5000 జనాభా ఉండగా, ఇప్పటిదాకా 2000 మంది వలసెళ్లిపోవడం గమనార్హం. దీంతో ఆయా తండాల్లో చాలా ఇళ్లు తాళాలతో దర్శనమిస్తున్నాయి. కూలిపనుల కోసం రూ.50వేల నుంచి రూ.లక్ష దాకా అడ్వాన్సు పుచ్చుకొని గుంపు మేస్త్రీల వెంట కరీంనగర్, హైదరాబాద్, ముంబై తదితర ప్రాంతాలకు ఎంతోమంది తండావాసులు వెళ్లిపోతున్నారు.

వలసలతో ఎఫెక్ట్ ఈ తండాల్లో..

పంచరాయితండా, మాన్‌సింగ్‌తండా, చింతల్ తండా, పంతులుతండా, గుడిబండతండా, రూప్ల తండా, వెంకట్‌తండా, జాటోతుబోజ్యతండా, కొత్త తండా, దేశ్యతండ, భీల్యతండ, జాలుబాయితండ, వాల్యతండ, ఎన్యానాయక్‌తండ, బొత్తలపర్రె, శివుల తండా.

అప్పులు తీర్చేందుకే..

తండాల్లో సాగు కలిసిరాక, ఉపాధి లేకపోవడంతో అప్పుల భారాన్ని తగ్గించుకునేందుకే వలస వెళ్తున్నట్లు ఎక్కువ మంది గిరిజనులు చెబుతున్నారు. జిల్లాలో మెట్ట ప్రాంతమైన తరిగొప్పుల మండలానికి ఏ ప్రాజెక్టుల ద్వారా నీరు అందకపోవడంతో వ్యవసాయం లాభసాటిగా లేదు. వర్షధారంపై ఆధారపడి ఎంతో కొంత సాగు చేస్తే నష్టపోయి అప్పులపాలైన వారు అనేక మంది ఉన్నారు. మరికొందరు ఇళ్ల నిర్మాణం, పెళ్లిలు తదితర కార్యాలకు అప్పులు చేసిన వారున్నారు. తండాల్లో ఉపాధి పనులకు వెళ్లినా గిట్టుబాటుకావడం లేదని, కుటుంబ పోషణకు, అప్పుల తీర్చేందుకు సరిపోవడం లేదని కొందరు తెలిపారు. గుంపు మేస్త్రీల నుంచి ఒకేసారి కొంత పెద్ద మొత్తం అడ్వాన్స్‌గా చేతికి అందుతుండటం కూడా వలసలు వెళ్లేందుకు ఓ కారణంగా తెలుస్తోంది. రూ .50వేల నుంచి రూ.లక్ష వరకు ఒకేసారి చేతికొస్తే కుమార్తెల పెళ్లికో, అప్పులు తీర్చడానికో ఉపయోగపడుతున్నాయని వారు చెబుతున్నారు.

15 తండాలలో 256 కుటుంబాల వలసబాట

తరిగొప్పుల మండలంలోని తండాలవారీగా వలసవెళ్లిన కుటుంబాల వివరాలు ఇలా ఉన్నట్లు ఆంధ్రజ్యోతి పరిశీలనలో తెలిసింది. జాలుబాయితండ - 22, పంచరాయితండ - 08,మాన్‌సింగ్‌తండ - 24, చింతల్‌తండ -18, పంతులుతండ -14, గుడిబండతండ - 17, రూప్లతండ - 15, వెంకట్‌తండ - 20, జాటోతుబోజ్యతండ - 24, కొత్త తండ - 22 ,దేశ్యతండ - 20, భీల్య తండ - 12 , వాల్యతండ - 08, బొత్తలపర్రె - 22, శివులాతండా నుండి 10 కుటుంబాలు వలస వెళ్లాయి.

కొడుకులున్నా అనాథగా మిగిలాను..



నాకు ఇద్దరు కొడుకులున్నారు. వారికి పెళ్లిలు చేశాను. తండాలో ఎవుసం కలిసి రాక అప్పులపాలైన కొడుకులు బతుకుదెరువుకోసం భార్యాపిల్లలతో కలిసి కరీంనగర్‌కు వలస వెళ్లారు. వృద్ధాప్యంలో నాకు ఆసరాగా నిలుస్తారనుకున్న కొడుకులు అనాథగా వదిలివెళ్లారు. ప్రభుత్వం ఏదైనా కాలువల ద్వారా చిన్న చిన్న చెరువు కుంటలను నింపితే ఎవుసం లాభసాటిగా మారుతుంది. అప్పుడే నా కొడుకులు తండాలోనే ఉండే పరిస్థితి ఉంటుంది.

- బానోతు గుగాని, కొత్తతండా

ఆర్థిక ఇబ్బందుల వల్లే వలస వెళ్తున్నాం



మూడు సంవత్సరాలుగా మా తండా నుంచి వలసలు జరుగుతూనే ఉన్నాయి. మాకు రెండెకరాల భూమి ఉన్నా పంటలు పండటం లేదు. అందుకే బతుకుదెరువుకనీ వలస వెళ్తున్నం. అక్కడే పనిచేసుకుంటూ బతుకుతున్నం.

- భూక్య శ్రీరాములు, పంచరాయితండా

గుంపు మేస్త్రీలపై కఠిన చర్యలు



నిబంధనలకు విరుద్ధంగా వ్యక్తులను వలస తీసుకెళ్లడం నేరం. మండలంలో ఎవరైనా గిరిజనులను ఇతర ప్రాంతాలకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే వలస వెళ్లినవారిని తిరిగి మండలానికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటాం. తండాల్లో ఉపాధి పనులు కల్పించేలా చూస్తాం.

- మహ్మద్ సలీం, తహసీల్దార్, తరిగొప్పుల

పిల్లల చదువు ఆగమైతాంది..



జనగామ జిల్లాలోనే తరిగొప్పుల మండల ప్రాంతంలో అతి తక్కువ వర్షపాతం నమోదుకావడంతో కరువు ఏర్పడింది. దీంతో తండావాసులు వలసకూలీలుగా మారారు. ఇక్కడ నేను రెండు సంవత్సరాలుగా పనిచేస్తున్నాను. తల్లిదండ్రులు వలస వెళ్లడంతో పాటు పిల్లలను కూడా తమ వెంట తీసుకునిపోతున్నారు. అక్కడ పనులు దొరకనప్పుడు మళ్లీ ఇంటికే వస్తున్నారు. దీంతో పిల్లలు సరిగ్గా పాఠశాలకు హాజరుకాలేకపోతున్నారు.

- దేశబోయిన రామన్న, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

వర్షాలు లేక రైతుల అయోమయం

చిన్నగూడూరు (మహబూబాబాద్ జిల్లా)

చిన్న గూడూరు మండలంలో ప్రస్తుతం పెసర పూత, పింద దశలో ఉండాల్సిన సమయంలో తెగుళ్ల భారిన పడటంతో రైతులు అయోమయనికి గురవుతున్నారు.ముచ్చటా మూడువాగులు కలిగినప్పటికి చెరువుల్లో నీటిజాడ లేక ఈ ఏడాది కనీసం చెరువు,సాగునీటి బావులపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులు సైతం ఇబ్బందులుపడుతున్నారు.చెరువుల్లో నీరు లేక బావురమంటున్నాయి.పలు చెరువుల్లో కనీసం పశువుల దాహర్తి తీర్చవీలుగాని పరిస్థితి నెలకొంది. పలు గ్రామాల్లో నారుమళ్లు ముదురిపోతున్నాయి. శ్రీరాం సాగర్ ద్వారా జలాలు వదలాల్సిన అధికారులు కనీసం అటువైపుగా చర్యలు తీసుకోకపోవటం మూలన రైతులు ప్రస్తుత ఖరీఫ్ కన్నీళ్ల పర్యంతంగా మారుతోంది.



తెగుళ్లుసోకడంతో దెబ్బతిన్న పెసర చేను

కాల్వల్లోకి నీళ్లు వదలకపోవడంతో..

ఖరీఫ్ ప్రారంభంలో ఆశాజనకంగా వర్షాలు కురవటంతో సంతోషపడిన రైతులు పెసర,మినుము ఇతర ఆనాస పంటలు వేసుకున్నారు.ఈ నేపథ్యంలో నీరందక పంటలకు తెగుళ్లు సోకి పంట నష్టాన్ని మిగుల్చుతున్నాయి. అదునులో వర్షాలు ముఖం చాటేయడంతో వేసవిని తలపించేలా ఎండల మూలన పత్తి పంట ఎండిపోతోందని రైతులు వాపోతున్నారు. రిజర్వాయర్లలోకి నీరు సమృద్ధిగా వచ్చి చేరుతున్నప్పటికి కాల్వల్లోకి ఇరిగేషన్ అధికారులు నీళ్లు వదలకపోవటం మూలన చెరువులు,కుంటలు వెలవెల బోతున్నాయి. మరిపెడచిన్నగూడూరు మండలాల్లో గత ఏడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది.4200 హెక్టార్‌లలో పెసర, హెక్టార్‌లలో పత్తి, 1400 హెక్టార్‌లలో వరి సాగు అవుతోంది.



చుక్కనీరు లేని తండా ధర్మారం చెరువు

అప్పులే మిగులుతున్నయ్



ఖరీఫ్,రబీ పంటలు వరుసగా అప్పులు మిగుల్చుతున్నాయి.గత ఏడాది వరి ఆశాజనకంగా పండినప్పటికి గిట్టుబాటు ధరల్లేక అప్పుల ఊబిలో ఉన్నాం.ఈ ఏడాది నీళ్లలేక కన్నీళ్లు వస్తున్నాయి.

- వీరన్న, రైతు

ఎస్ఆర్ఎస్పీ జలాలతో నింపాలి



శ్రీరాం సాగర్ జలాలతో చెరువులు నింపి రైతులను కాపాడాలి. వరుసగా పంటల నష్టాల మూలన సాగు చేయటం ఇబ్బందికరంగా ఉంటోంది.ప్రభుత్వం రైతులకు సాగు నీళ్లందిస్తే ఆత్మస్థైర్యం కలుగుతుంది.

- సంతోష్, రైతు



గుండంరాజుపల్లిలో పసుపు పంటకు నీళ్లు పారిస్తున్న రైతు వెంకన్న

కరువు మేఘాలు

వర్షాభావ పరిస్థితులు, తెగుళ్లు కర్షకునికి కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. అదును లోనూ వరుణుడు మోహం చాటు వేయటంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తాయని ఆశించిన రైతులకు నిరాశే మిగులుతోంది. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు, మరిపెడ, నర్సింహులపేట మండలాల్లోని కొన్ని గ్రామాల్లో మినహా వర్షపు జాడ లేకపోకవటంతో సన్న, చిన్నకారు రైతులతో పాటు వ్యవసాయ కూలీలు సైతం ఇబ్బందులు పడుతున్నారు.

- అదునులో మొహం చాటేస్తున్న వరుణుడు
- కళ తప్పిన చెరువులు
- ఎండుతున్న వరి నారుమడులు

నర్సింహులపేట (మహబూబాబాద్ జిల్లా)

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు ఆనందంతో ఖరీఫ్ సాగును ప్రారంభించిన అన్నదాతకు కన్నీరే మిగులుతోంది. రెండు వారాల నుంచి వరుణుడు ముఖం చాటేయడంతో పునాస పంటలు పెసర, మొక్కజొన్న, పసుపు, కంది, పత్తి పంట చేలను కాపాడుకునేందుకు జలాశయాల్లో కొద్దో గొప్పో ఉన్న జలాలతో కర్షకులు భగీరథ యత్నం చేస్తున్నారు. ఎండల తీవ్రతకు ఎండుతున్న పంటలను చూసి రైతులు ఆందోళన చెందుతూ ఆకాశం వైపు దిగులుపడి చూస్తున్నారు.

16 మండలాల్లో..

జిల్లాలోని 16 మండలాల్లో 232 గ్రామాలు, శివారు తండాల పరిధిలో 1,13,991 హెక్టార్లల్లో వివిధ రకాల పంటను సాగు చేశారు. వీటిల్లో పత్తి 37,099 హెక్టార్లు, పెసర 14,666, వరి 31,234, మిర్చి 92,117, పసుపు 4498, మినుములు 61 హెక్టార్లు, కందులు 2367 హెక్టార్లల్లో పంటను సాగు చేశారు. ఎండల తీవ్రత పెరగడంతో పంట చేళు ఎండలకు ఆహుతి అవుతుండడం చూసి అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో సకాలంలో వర్షాలు కురువడంతో కోటి ఆశలతో విత్తనాలు విత్తినప్పటికీ పైరు దశకు వచ్చేసరికి ఎండల తీవ్రత పెరిగిపోవడంతో ఖరీఫ్ పంటలు అర్థాంతరంగా ఎండిపోతున్నాయి.

పంటలు ఎండిపోతున్నాయి..



మాకు ఐదు ఎకరాల సాగు భూమి ఉన్నది. 2 ఎకరాలు పత్తి, ఎకరంలో వరి, 2 ఎకరాలు పెసర పంటలు సాగు చేశాము. భూగర్భ జలాలు తగ్గి పంటలకు సాగునీరు అందడం లేదు. ఎండల తీవ్రతతో పంట చేలు ఎండిపోతున్నాయి. వర్షాకాలంలో కూడా వానాలు పడకపోవడంతో పంటను కాపాడుకోవడానికి చాలా కష్టాలు పడుతున్నాం.

- గుగులోతు జమున, పక్కీరతండ ముంగిమడుగు

ఇలాంటి గడ్డుకాలం ఎప్పుడూ చూడలేదు



ఇలాంటి గడ్డుకాలం నేను ఎప్పుడూ చూడలేదు. ఖరీఫ్ సాగుకు వేలల్లో అప్పులు తెచ్చి సాగును ప్రారంభించాము. పెసర, పసుపు, పత్తి పంట చేలు ఏపుగా పెరగడంతో ఆనందించాము. ఎండల తీవ్రతతో సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. దిగుబడి తగ్గి అప్పులే మిగిలేటట్లుగా ఉంది.

- జక్కుల వెంకన్న, గుండంరాజుపల్లి

ముఖం చాటేసిన వరుణుడు..

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వరుణుడు సకాలంలో కరుణించడంతో కోటి ఆశలతో సాగును ప్రారంభించిన అన్నదాతలు విత్తనాలు విత్తారు. పంట చేలు ఏపుగా పెరిగి చేతికి అందేదశలో రెండు వారాల నుంచి కారుమబ్బులు కమ్మేస్తున్నా వరుణుడు ముఖం చాటేయడంతో వేల హెక్టార్లల్లో పంట చేలు అర్థాంతరంగా ఎండిపోతుండడం చూసి కర్షకులు కన్నీరు పెడుతున్నారు.

ఎండుతున్న పంట చేలు..

పూతదశలో పెసర, మొగ్గ దశలో పత్తి, చేతికి అందవచ్చిన మొక్కజొన్న పంట చేలు ఎండల తీవ్రతకు అర్థాంతరంగా ఎండిపోతున్నాయి. మరో వారం రోజులు ఎండల తీవ్రత ఇలాగే ఉంటే వేల హెక్టార్లల్లో పంట చేలు ఎండిపోయి రైతులకు తీవ్రత నష్టం వాటిల్లడం తప్పదని రైతులు ఆవేధన చెందుతున్నారు. గడిచిన సంవత్సరం మద్దతు ధర లేకపోవడం, ఈ యాడాది వర్షాభావ పరిస్థితులతో రైతులు పీకల్లోతు అప్పల్లో కూరుకుపోనున్నారు. సాగుకు తెచ్చిన అప్పులు రెట్టింపు కావడం, పిల్లల చదువులు మందుకు సాగకపోవడం కుటుంబాన్ని సాకడం రైతులకు కష్టతరంగా మారనున్నది.

అడుగంటిన భూగర్భ జలాలు..

ఎండల తీవ్రత పెరిగి పోవడంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోయాయి. వ్యవసాయ బావులు, బోరు బావుల్లో నీరు క్రమేపి తగ్గుతుంది. పగలు మొత్తం మోటారుకు అందాల్సిన సాగు నీరు అంచలంచలుగా తగ్గుతుండడంతో సాగు కష్ట తరంగా మారిందని ఆందోళన చెందుతున్నారు.



బొజ్జన్నపేటలో ఎండిపోతున్న మొక్కజొన్న చేను

బీమా కల్పించని ధీమా..

ప్రతి యేటా పత్తి, మిర్చి, మొక్కజొన్న, పసుపు రైతులు పంటల బీమా చేస్తున్నప్పటికీ వాతావరణ సమతూల్యత ప్రభావంతో అతివృష్టి, అనావృష్టి సమస్యతో నిత్యం రైతులు నష్టపోతునే ఉన్నారు. గత మూడుళ్ళ నుంచి మండలంలో వర్షాభావ పరిస్థితులు నెలకొని రైతులు పంటను నష్టపోతున్నప్పటికీ అటు ప్రభుత్వం.. ఇటు భీమా కంపెనీల నుంచి ఎలంటి పరిహారం అందడంలేదు.

మత్స్యకారులకూ తప్పని తిప్పలు

కాకతీయ కాలనీ (హన్మకొండ)

మత్స్యకారులపై ప్రకృతి కన్నెర్ర చేస్తోంది. వర్షాధారంగా చేపల పెంపకంతో ఉపాధి పొందుతున్న మత్స్యకారులకు ఈ సంవత్సరం నిరాశే మిగులుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో 654 మత్స్య పారిశ్రామిక శాఖ సహకార సంఘాలలో 86 మహిళా సహకార సంఘాలున్నాయి. దాదాపు 60 వేల మంది మత్స్యకారులు చేపల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. రెండేళ్లుగా ప్రభుత్వమే ఉచితంగా మత్స్యకారులకు చేపపిల్లలను పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. 16 రిజర్వాయర్‌లు, 716 సాగునీటి ట్యాంకులు, గ్రామ పంచాయతీల పరిధిలో 3600 చిన్నకుంటలు, చెరువులలో చేపల పెంపకం చేపడుతున్నారు. వర్షాలు కురిసే జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో చెరువులు, కుంటలు, ఇతర జలవనరులలో జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో చేపపిల్లల్ని వదిలి పెంపకం ప్రారంభిస్తుంటారు. దాదాపు 8 నెలల పాటు జాగ్రత్తగా పెంపకం చేస్తే చేపలు అనుకున్న స్థాయిలో లాభాలను తెచ్చిపెడతాయి. ప్రతీ ఏటా 13 నుంచి 20 వేల టన్నుల చేపల దిగుబడి సాధిస్తున్నారు. ఈ సంవత్సరం సమయం దాటిన తరువాత చేపపిల్లలను వేసినా ఎదుగుదల లేక వాటిని పెంపకంలో ఆర్థిక నష్టాలు భరించాల్సి వస్తుందని గంగపుత్రులు వాపోతున్నారు.

మత్స్యకారులను ప్రభుత్వమే ఆదుకోవాలి



- బుస్స మల్లేశం, జిల్లా మత్స్య పారిశ్రామిక శాఖ సహకార సంఘం అధ్యక్షుడు

ఈ సంవత్సరం ఉమ్మడి జిల్లా మత్స్యకారులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఎనిమిది కోట్ల చేపపిల్లలు సిద్ధం చేసింది. వర్షాభావం కారణంతో చేపపిల్లల్ని ఇంకా మత్స్యకారులకు పంపిణీ చేయలేదు. చెరువులో నీరు కూడ చేపలు పెంచేంత లేకపోవడంతో చేప పిల్లలను తీసుకోవడం లేదు. ఈ పరిస్థితుల్లో చేప పిల్లల్ని చెరువుల్లో వేసినా అవి బతికే అవకాశాలు తక్కువ. తెలంగాణ ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకోవాలి.

మన విత్తనం.. మనదే పెత్తనం..

రాష్ట్రాన్ని విత్తన భాండాగారంగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ సంకల్పానికి గోవిందరావుపేటలోని విత్తన శుద్ధికేంద్రం బాసటగా నిలుస్తోంది. మన విత్తనం.. మనదే పెత్తనం.. నినాదంతో మెరుగైన ఫలితాలు సాధిస్తోంది. ప్రారంభమైన మొదటి సీజన్‌లో రికార్డుస్థాయిలో విత్తనాలను ఉత్పత్తిచేసి భరోసానిస్తోంది. కాకతీయుల వరప్రదాయిని లక్నవరం సరస్సు జలాలతో పుట్లకొద్ది ధాన్యాన్ని పండిస్తున్న ఇక్కడి అన్నదాతలు తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఓవైపు కొత్త వంగడాలను సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తూనే.. మరోవైపు మిగతా రైతులకు కావాల్సిన సీడ్ విత్తనాలను సైతం ఉత్పత్తి చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



గోవిందరావుపేటలోని ప్రభుత్వ విత్తనశుద్ధి కేంద్రంలోని యంత్ర సామగ్రి

- తెలంగాణకు తలమానికంగా వరిధాన్యం విత్తనోత్పత్తి కేంద్రం
- ప్రారంభమైన తొలి సీజన్‌లోనే సక్సెస్

గోవిందరావుపేట (జయశంకర్ జిల్లా)

తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సీడ్‌బ్యాంకు నిధుల నుంచి రూ.3.89 లక్షలతో గోవిందరావుపేటలో విత్తనశుద్ధి కేంద్రం, 15వేల క్వింటాళ్ల సామర్థ్యం కలిగిన గోదాము నిర్మించారు. ఈఏడాది మే 4న వ్యవసాయ శాఖామంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేతులమీదుగా దీన్ని ప్రారంభించారు.

సన్నాల సాగులో ఖ్యాతిగడిస్తూ..

నీటి లభ్యతను బట్టి రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్, రబీలో వరి సాగవుతోంది. ఖరీఫ్‌తో పోల్చుకుంటే రబీలో సాగు తగ్గుతుంది. అయితే రెండు కాలాలకు కలిపి 25వేల క్వింటాళ్ల విత్తనాలను ఇక్కడ ఉత్పత్తి చేస్తున్నారు. గత 30ఏళ్లుగా నాణ్యమైన విత్తనధాన్యం సాగుచేస్తూ తెలుగురాష్ట్రాల్లో పేరుగాంచిన స్థానిక రైతులు గడిచిన కొన్నేళ్లుగా కొత్త రకం వంగడాలను కూడా ఉత్పత్తి చేస్తున్నారు. వ్యవసాయ శాఖ ప్రయోగాత్మకంగా సృష్టించిన రకాలను లక్నవరం సరస్సు ఆయకట్టులో సాగుచేసి మెరుగైన దిగుబడి సాధిస్తున్నారు. ఆర్ఎన్ఆర్-15048తోపాటు బీపీటీ, 1010, 1001, బతుకమ్మ, పూనారం సన్నాలను విరివిగా సాగుచేస్తున్నారు. మంచి నాణ్యత ఉండటంతో ప్రభుత్వ, ప్రైవేటు విత్తనకంపెనీలు క్యూ కడుతున్నాయి. ప్రభుత్వం 25వేల క్వింటాళ్ల సీడ్ విత్తనాలను సేకరిస్తుండగా, ప్రైవేటు సంస్థలు సుమారు 40వేల క్వింటాళ్ల దాకా ఇక్కడి నుంచి సేకరిస్తున్నాయి.

ఉత్పత్తి పెంచాలనే డిమాండ్

లక్నవరం సరస్సు ఆయకట్టులో అధికారికంగా 8500ఎకరాలు, అనధికారికంగా 12వేల ఎకరాలు సాగవుతుండగా ఎక్కువ మంది రైతులు సీడ్ ధాన్యాన్నే సాగుచేస్తున్నారు. అయితే ప్రభుత్వం ఏర్పాటుచేసిన విత్తనశుద్ధికేంద్రం సామర్థ్యం 25వేల క్వింటాళ్లే కాగా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలనుంచి వస్తున్న డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తిని పెంచాల్సి ఉంది. గత రబీ సీజన్‌లో సన్న ధాన్యం క్వింటాకు ప్రభుత్వం రూ.2250, ప్రైవేటు సంస్థలు రూ.1700 చెల్లించాయి. ప్రైవేటు సంస్థలతో పోల్చుకుంటే ప్రభుత్వం సేకరించే ధాన్యానికి మంచి రేటు వస్తుండటంతో మిగతా రైతులు కూడా తమ ధాన్యాన్ని ప్రభుత్వమే సేకరించాలని కోరుతున్నారు.

గోదాములు సరిపడా లేక..

తెలంగాణ సీడ్ కార్పొరేషన్ నిర్మించిన గోదాములు సరిపోవడంలేదు. 15వేల క్వింటాళ్ల నిల్వ సామర్థ్యంతో ఒకే గిడ్డంగి నిర్మించగా ఉత్పత్తి మాత్రం 25వేల క్వింటాళ్లు కావడంతో బస్తాలను నిల్వచేయడం కష్టంగా మారింది. అదనంగా మరో 15వేల క్వింటాళ్ల నిల్వ సామర్థ్యం కలిగిన గోదామును నిర్మించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

